
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పల్నాడు జిల్లా వార్తలు

5

మంగళవారం 24 డిసెంబరు 2024

● చొరవ చూపని ఏపీసీపీడీసీఎల్ ● మూడు జిల్లాలు కలిపినా వెయ్యి లోపే కనెక్షన్లు ● ఆర్థిక ప్రయోజనాలను షార్టు వీడియోల ద్వారా ప్రదర్శించాలి ● కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు

సూర్యఘర్ స్కీమ్.. అమలులో

నిర్లక్ష్యం

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన (పీఎంఎస్‌జీవై) స్కీమ్ అమలులో మూడు జిల్లాలు వెనకబడిపోయాయి. ఈ పథకం అమలులోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా నామమాత్రంగానే రూఫ్‌టాప్ సోలార్ కనెక్షన్లను డిస్కమ్ సంస్థలు ఏర్పాటు చేయడం వాటి నిర్లక్ష్యాన్ని ఎండగడుతున్నాయి. జిల్లాలకు ఇచ్చిన లక్ష్యంలో కనీసం 10 శాతం కూడా అధిగమించలేని దుస్థితి కొనసాగుతున్నది. ప్రధానంగా ఈ పథకంపై ప్రజల్లో అవగాహన కొరవడింది. దీనివలన కలిగే ప్రయోజనాలను వివరించడంలో డిస్కమ్ అధికారులు విఫలమయ్యారు. కేవలం కరపత్రాల పంపిణీకే పరిమితం కావడం స్కీమ్ అమలుపై ప్రభావం చూపిస్తున్నది. దీంతో ప్రతీ ఇల్లు ఒక సౌర విద్యుత్ ఉత్పాదక యూనిట్ కావాలని భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఆశయం నీరుగారి పోతున్నది.

విద్యుత్ బిల్లులు పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు భారంగా మారుతున్నాయి. ట్రూఅప్ చార్జీల పేరుతో మోపుతున్న భారంతో కరెంటు బిల్లులు ప్రతీ నెలా షాకిస్తున్నాయి. దీనివలన ఆయా కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాయి. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకొన్న కేంద్ర ప్రభుత్వం 2022 జూలై నెలలోనే పీఎం సూర్యఘర్ యోజన స్కీమ్‌ని అమలులోకి తీసుకొచ్చింది. వినియోగదారుడు ప్రతీ నెలా

పీఎం సూర్యఘర్ యోజన స్కీమ్ కింద ఏర్పాటు చేసిన రూఫ్‌టాప్ సోలార్



ఖర్చు చేసే విద్యుత్ యూనిట్ల ఆధారంగా రూఫ్‌టాప్ సోలార్ పవర్‌ని ఏర్పాటు చేసుకోవచ్చు. ఒక కిలోవాట్ మొదలుకొని 3 కేడబ్ల్యూ వరకు ఏర్పాటు చేసుకొనే వెసులుబాటు ఉన్నది. రూ. 2 లక్షల విలువ చేసే సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకొనేందుకు కేంద్ర ప్రభుత్వం రూ. 72 వేల వరకు సబ్సిడీ ఇస్తున్నది. మిగతాది బ్యాంకుల నుంచి రుణం మంజూరు చేయిస్తున్నది.

ఏడాదిలో కనీసం 9 నెలల పాటు గరిష్ఠంగా విద్యుత్‌ని ఈ సోలార్‌ప్లాంట్ ఉత్పత్తి చేస్తుంది. గృహావసరానికి పోను మిగులు విద్యుత్‌ని డిస్కమ్ తీసుకొని సర్దుబాటు చేస్తుంది. ఒక విధంగా మిగులు విద్యుత్ వలన జరిగే బిల్లు ఆదాతో బ్యాంకు రుణం తీర్చవచ్చన్నది కేంద్ర ప్రభుత్వ వాదన. అయితే రిజిస్ట్రేషన్ మొదలుకొని వెండార్ ఎంపిక, బ్యాంకు రుణం పొందడంలో సమస్యలు ఉత్పన్నమౌతున్నాయని వినియోగదారులు చెబుతున్నారు. ఇది కూడా పథకం నెమ్మదించడానికి ఒక కారణంగా ఉన్నది. పీఎం సూర్యఘర్ వెబ్‌సైట్‌లో జరుగుతున్న రిజిస్ట్రేషన్లకి ప్లాంట్ ఇన్‌స్టలేషన్ గణాంకాలకు ఏమాత్రం పొంతన ఉండటం లేదు. బాపట్ల జిల్లాలో 6319 రిజిస్ట్రేషన్లు జరిగితే అప్లికేషన్లు మాత్రం 1,735 మాత్రమే ప్రాసెస్ అయ్యాయి. వాటిల్లో ఇప్పటివరకు ఇన్‌స్టలేషన్ జరిగింది 231 మాత్రమే. ఇక సబ్సిడీ అయితే 140 కనెక్షన్లకే విడుదల చేశారు. గుంటూరు జిల్లాలో 16 వేల పైచిలుకు రిజిస్ట్రేషన్లు నమోదు జరిగితే, అప్లికేషన్లు 5 వేల నుంచి 6 వేల మధ్యనే ఉన్నాయి. వాటిల్లో 631 ప్లాంట్ల ఇన్‌స్టలేషన్ జరిగింది. సబ్సిడీ అయితే ఇందులో 364 మందికి విడుదలైంది. పల్నాడు జిల్లాలో 10318 రిజిస్ట్రేషన్లు జరుగగా 1281 అప్లికేషన్లు ప్రాసెసింగ్ జరిగింది. వాటిల్లో ఇన్‌స్టాల్ అయినవి 133 మాత్రమే. సబ్సిడీ అయితే కేవలం 56 మందికే వచ్చింది. ఈ గణాంకాలు పరిశీలిస్తే మూడు జిల్లాల పురోగతి చాలా పూర్‌గా ఉండటంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మంత్రి పెమ్మసాని, 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ దినకర్ సమీక్షలు ప్రారంభించారు. విద్యుత్ అధికారులు స్వయం సహాయక సంఘాలను సమన్వయం చేసుకొని ప్రజల వద్దకు వెళ్లి లాభాలను వివరించి పీఎం సూర్యఘర్ యోజన్ స్కీమ్‌ని పురోగతిలోకి తీసుకురావాలని ఆదేశించారు. మరో మూడు నెలల్లో మళ్లీ సమీక్ష ఏర్పాటు చేస్తామన్నారు.

ప్రభుత్వ జీవోనూ...

పట్టించుకోవడం లేదు

ఈవీలపై వీడని 'పన్ను'పోటు!



- ఈనెల 11 నుంచే అమలులోకి రావాల్సిన 'ఏపీ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ'
- జీవో విడుదలై పక్షం కావస్తున్నా దక్కని పన్ను రాయితీ
- అధికారుల నిర్వాకంతో ప్రభుత్వ లక్ష్యానికి దెబ్బ
- పాలసీ అమలు చేయకపోవడంతో లబ్ధిదారులపై భారీ మోత

రాష్ట్రంలో విద్యుత్ వాహనాలపై ఇప్పటికీ పన్ను పోటు తప్పడం లేదు. విద్యుత్ వాహనాలను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాయితీలను అమలు చేయడంలో అధికారులు చూపుతున్న నిర్లక్ష్యం ప్రభుత్వ లక్ష్యాన్ని ఘోరంగా దెబ్బతీస్తోంది. దేవుడు వరమిచ్చినా పూజారి మాత్రం కనికరించ లేదన్న చందంగా రాష్ట్ర రవాణా శాఖ వినియోగదారులపైనా మోయలేని భారాన్ని వేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ వాహనాలపై కొత్త పాలసీని అమలులోకి తీసుకువచ్చి పక్షం రోజులు అవుతున్నా అది ఇంత వరకూ అమలులోకి రాకపోవడం పట్ల సర్వత్రా చర్చ సాగుతోంది.

గుంటూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): డిసెం బరు 11న రాష్ట్ర ప్రభుత్వం 'ఏపీ సస్టైయినబుల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ 4.0'ను విడుదల చేసింది. ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ విభాగం ఆ జీవోను విడు దల చేసింది. విద్యుత్ వాహనాల ఉత్పత్తిదారులు, విక్రేతలు, వినియోగదారులకు ఎన్నో రకాల రాయితీలు, ప్రోత్సాహకాలను ఆ జీవోలో ప్రభుత్వం ప్రకటించింది. 2024 డిసెంబరు 11 నుంచి 2029 డిసెంబరు 10వ తేదీ వరకూ అమలులో ఉండే ఆ జీవో తాలూకు ప్రయోజనాలన్నీ డిసెంబరు 11 నుంచే అమలులోకి వస్తాయని స్పష్టంగా జీవోలో పేర్కొన్నారు. అయితే ఆ జీవో ఇప్పటి వరకూ అమలుకు నోచుకోలేదు. జీవోను అమలులోకి తీసుకురావాల్సిన రవాణా శాఖ నుంచి ఇప్పటి వరకూ ఎలాంటి స్పష్టతా రాలేదు.

ప్రతిసారీ ఇదే తంతు..?

2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏపీ విద్యుత్ పాలసీని రూపొందించింది. దాని గడువు 2023తో ముగిసింది. అయితే అప్పటి వైసీపీ ప్రభుత్వం కొత్త పాలసీని రూపొందించకుండా పాత పాలసీనే పొడిగిస్తూ వచ్చింది. ఇలా గడువు ముగిసిన ప్రతి సారీ వినియోగదారులపై 12 శాతం రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ చార్జీల భారం పడింది. దీంతో వినియోగదారులు భారీ మొత్తంలో నష్టపోవాల్సి వచ్చింది. జీవో గడువు ముగిసిన రెండు మూడు నెలల వరకూ జీవోని



పునరుద్ధరించక పోవడంతో ఆ సమయంలో కొన్న వినియోగదారులు 12 శాతం చొప్పున రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ చార్జీలు భారీ మొత్తంలో చెల్లించాల్సి వచ్చింది. తాజాగా జూన్ 7న గడువు ముగిస్తే దాన్ని తిరిగి పునరుద్ధరించడానికి అక్టోబరు వరకూ ఆగాల్సి వచ్చింది. దీంతో ఆ 4 నెలల కాలంలో విద్యుత్ వాహనాలు కొన్నవారిపై 13 నుంచి 2 లక్షల వరకూ భారం పడింది. విద్యుత్ కార్లు కొన్నవారికి రూ. 4 లక్షల వరకూ భారం పడింది. కాగా అక్టోబరులో పొడిగించిన జీవో జూన్ 7 నుంచి డిసెంబరు 7వ తేదీ వరకూ మాత్రమే అమలులో ఉంది. అయితే కొత్తగా వాహనాలు కొనుగోలు చేయాలనుకునేవారు దసరా, దీపావళి పండుగ సమయాల్లోనే వాహనాలను కొంటారు. ఆ సమయంలో పన్ను రాయితీ లేకపోవడంతో వాహనాలు కొన్నవారంతా

(మిగతా 6వ పేజీలో)

దెబ్బతింటున్న ప్రభుత్వ లక్ష్యం..

విద్యుత్ వాహనాల వినియోగంలో రాష్ట్రం చాలా వెనుకంజలో ఉంది. 2024 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 1.78 కోట్ల విద్యుత్ వాహనాలు ఉండగా, అందులో విద్యుత్ వాహనాల వాటా నామమాత్రమే. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా లక్షా 30వేల విద్యుత్ వాహనాలు, 817 హైబ్రిడ్ విద్యుత్ వాహనాలు మాత్రమే వున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈవీ వాహనాలను ప్రోత్సహించడంపై దృష్టిపెట్టింది. 2018లో రూపొందించిన పాలసీ గడువు 2023తో పూర్తవగా, గత వైసీపీ ప్రభుత్వం ఆరు నెలలు చొప్పున రెండు సార్లు పొడిగించింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ ఏడాది అక్టోబరులో మరోమారు పొడిగించింది. ఈ గడువు కూడా డిసెంబరు 7తో పూర్తయింది. పొడిగింపుల పర్వానికి స్వస్తి చెబుతూ కూటమి ప్రభుత్వం తాజా గడువు ముగిసిన మూడు రోజుల్లోనే కొత్త పాలసీని ప్రకటించింది. ఆ పాలసీ ద్వారా 2029 నాటికి రాష్ట్రంలో 2 లక్షల విద్యుత్ టూ వీలర్స్, 10వేల త్రీ వీలర్స్, 20 వేల ఫోర్ వీలర్స్‌ను రిజిస్ట్రేషన్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం టార్గెట్‌గా పెట్టుకుంది. పాలసీని రూపొందించడంలో ప్రభుత్వం చూపిన చొరవను ఏమాత్రం పట్టించుకోని రవాణా శాఖ అధికారులు దాని అమలుపై మీన మేషాలు లెక్కిస్తున్నారు. దీంతో ప్రభుత్వం ప్రకటించిన లక్ష్యం దెబ్బతింటోంది.

ఎస్సీ కులాల ఉప వర్గీకరణపై **అభిప్రాయ సేకరణ**
● ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా రాక
● 30న జిల్లా అధికారులతో సమావేశం
● కుల సంఘాల నుంచి వినతుల స్వీకరణ

6

సీఎం పర్యటనను **విజయవంతం చేయాలి**
అధికారులకు సూచించిన కలెక్టర్ అరుణ్‌బాబు
పులిపాడులో హెలిప్యాడ్‌కు స్థల పరిశీలన

సేంద్రియ **ఆహారంతోనే ఆరోగ్యం**
● డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు

8

అవిశ్రాంత సాహితీ శ్రామికుడు.. **లక్ష్మీనారాయణ**
● కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్

జనవరి నుంచి రాజధాని నిర్మాణ పనులు ప్రారంభం



- సీఎఫ్‌ఎంఎస్‌తో సంబంధం లేకుండా మున్సిపాలిటీలకే నిధులు
- భవన నిర్మాణాలకు 15 రోజుల్లోనే అనుమతులు
- పురపాలక శాఖ మంత్రి నారాయణ

ఏఎన్‌యూలో జరిగిన మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీర్ల రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో ప్రసంగిస్తున్న మంత్రి నారాయణ, వేదిక పైన కన్నబాబు, ఇతర అధికారులు



క్రిస్మస్ సందడి


- నూతన శోభ సంతరించుకున్న చర్చిలు
- ఆకర్షణీయ రంగులతో వెలుగొందుతున్న స్టార్లు
- కిటకిటలాడుతున్న దుకాణాలు

మాచర్ల నియోజకవర్గంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వైసీపీ భూ చోళ్లు చెలరేగిపోయారు. వందల ఎకరాలు ఆక్రమించుకొని బ్యాంకుల్లో తనఖా పెట్టుకొని డబ్బు దండుకున్నారు. నిషేధిత భూములను కూడా వదిలి పెట్టకుండా పాసు పుస్తకాలు సృష్టించి ఖాతాలు తెరిచి భూములను తెగనమ్ముకున్నారు. మరికొంత మంది బ్యాంకుల్లో పెట్టి రుణాలు పొందారు. ఇలా ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో వైసీపీ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమ మార్గాల్లో డబ్బు కూడేసుకున్నారు.

వైసీపీ భూ చోళ్లు

- 300 ఎకరాలకు పైగా ఆక్రమణ
- బ్యాంకులను సైతం కొల్లగొట్టిన ఘనులు
- నిషేధిత భూములపై పాసు పుస్తకాలు పొంది బ్యాంకుల్లో లోన్లు

మాచర్లటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దుర్గి మండలం బుగ్గవాగు రిజర్వాయర్ భూములను లేని సబ్‌డివిజన్‌గా మార్చి లక్షలాది రూపాయల కుంభకోణానికి పాల్పడ్డారు. బుగ్గవాగు డ్యాం నిర్మాణ సమయంలో ముంపు కింద రైతుల వద్ద నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసి వారికి నష్ట పరిహారం చెల్లించి ఏడబ్ల్యూ ల్యాండ్ జాబితాలో చేర్చింది. అయితే మాచర్ల సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో వైసీపీకి చెందిన ఓ డాక్యుమెంట్ రైటర్ సహకారంతో దుర్గి మండలానికి చెందిన వైసీపీ రౌడీషీటరు ఊరబండి మన్నెయ్య ఆ భూములపై కన్నేశాడు. మాజీ ప్రజాప్రతినిధి సహకారంతో బుగ్గవాగు డ్యాం ముంపు భూములపై పాసు పుస్తకాలు పుట్టించాడు. సుమారు 50 ఎకరాలకు పైగా అతని కుటుంబ సభ్యులపై రికార్డుల్లో మార్చి ఆన్‌లైన్ వెబ్‌ల్యాండ్‌లో మార్చి ఖాతాలు తెరిచి పాసు పుస్తకాలు పుట్టించాడు. అంతటితో ఆగకుండా మంచికల్లు సొసైటీ బ్యాంకు, మాచర్ల యూనియన్ బ్యాంకు, స్టేట్ బ్యాంకు ఇలా వివిధ బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రూ.లక్షల్లో రుణాలు పొందారు. ఒకాయన అయితే భూమిని ఎటువంటి సబ్ డివిజన్ చేయకుండానే పాలువాయి సొసైటీ బ్యాంకులో రూ. 11 లక్షల రుణం పొందాడు.



వీఆర్వో కీలకం...

దుర్గి మండలంలో వీఆర్వో ఈ భూముల మార్పిడిలో జీవం పోసిన వ్యక్తి. వైసీపీ నేతల నుంచి ముడుపులు దండుకొని ఆన్‌లైన్ వెబ్‌ల్యాండులో మార్పులు చేర్పులు చేసి పాసు పుస్తకాలు సృష్టించి కట్టబెట్టాడు. దానికి ప్రతిఫలంగా వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు దుర్గి మండలంలో అతని మాటే శాసనంగా సాగించాడు. అధునాతన భవనం, కార్లు, విలువైన ఇంటి స్థలాలు భారీగా కూడబెట్టుకున్నాడు. మాజీ ప్రజాప్రతినిధి, అతని సోదరుడు అండదండలతో మండలంలో భూముల పందేరంలో ముఖ్య భూమిక పోషించాడు.

వివిధ మండలాల్లో ఇదే తంతు..

రెంటచింతల మండలం తుమ్మకోట గ్రామంలో కృష్ణానది పరివాహక ప్రాంతం ఆనుకొని ఖాతా నంబరు 8889, 9091లలో రెంటచింతలకు చెందిన ఇద్దరు నేతలు 4 ఎకరాలకు పాస్ పుస్తకాలు పొంది తుమ్మకోట యూనియన్ బ్యాంకులో రుణాలు పొందారు. మాచర్ల మండలం ఏడోమైలు వద్ద ఒక నేత డీకే భూమిని పట్టాదారు చేయించుకొని 1.16 ఎకరాలు రిజిష్టర్ చేయించుకున్నాడు. బ్యాంకులో రుణాలు పొందాడు. నాగులవరం పంచాయతీ విజయపురిసౌత్ విమానాశ్రయం సమీపంలో మాజీ ప్రజాప్రతినిధి బినామీ పేర్లతో సుమారు 200 ఎకరాలు ఆక్రమించారు. ఇలా నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా చెరువులు, కుంట భూములు, పోరంబోకు భూములు భారీ ఎత్తున ఆక్రమించారు. కూటమి ప్రభుత్వం ఈ భూ ఆక్రమణలపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

పల్నాడు రోడ్డులో రాస్తారోకో

- 167ఏ జాతీయ రహదారి భూసేకరణ వివాదాస్పదం
- నరసరావుపేటలో సర్వేను అడ్డుకుంటున్న రైతులు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఓడరేవు - కొండుగల 167ఏ జాతీయ రహదారి భూసేకరణ వివాదాస్పదంగా మారింది. భూముల్లో మార్కింగ్ ఇచ్చేందుకు వెళ్లిన రెవెన్యూ, జాతీయ రహదారి శాఖకు సంబంధించిన అధికారులను నరసరావుపేట వద్ద సోమవారం రైతులు అడ్డుకున్నారు. తమ భూముల్లో సర్వే రాళ్లు ఏర్పాటు చేస్తే ఊరుకునేది లేదని అధికారులకు తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలో పల్నాడు రోడ్డుపై రైతులు బైఠాయించి రాస్తారోకో చేశారు. నరసరావుపేట మండలం రావిపాడు, గుంటగార్లపాడు, నరసరావుపేట పరిధిలో నరసరావుపేట బైపాస్ భూసేకరణ ప్రక్రియను సదరు అధికారులు చేపట్టారు. దీనిని ఎక్కడికక్కడ రైతులు అడ్డుకుంటున్నారు. బైపాస్ అలైన్‌మెంట్‌ను మార్చాలని డిమాండ్ చేశారు.

739.31 ఎకరాల భూమి అవసరం

నాలుగు వరుసలుగా రోడ్డు విస్తరణ, చిలకలూరిపేట, నరసరావుపేట పట్టణాలకు బైపాస్ నిర్మాణానికి 739.31 ఎకరాల భూమి సేకరించాలని జాతీయ రహదారి శాఖ గుర్తించింది. దీనిలో 706.80 ఎకరాలు ప్రైవేట్ భూమి, 32.51 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉన్నట్టు నిర్ధారించారు. ప్రైవేట్ భూమి సేకరణకు సర్వే నెంబర్ల వారీగా గుర్తించారు. రైతుల పేర్లను కూడా నమోదు చేశారు. చిలకలూరిపేట మండలం కంతేటి వారి కండ్రిక, గొట్టిపాడు, పసుమర్రు, చిన కండ్రిక, బొప్పూడి, పురుషోత్తపట్నం, కావూరు గ్రామాల పరిధిలో భూమి సేకరించాలి. నాదెండ్ల మండలం గణపవరం, ఇర్లపాడు, కనపర్రు గ్రామ పరిధిలో భూమిని సేకరించాల్సి ఉంది. ఆయా గ్రామాల పరిధిలో భూసేకరణ ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చింది. పసుమర్రు నుంచి బొప్పూడి వరకు రహదారి నిర్మాణ పనులు కూడా చేపట్టారు. నరసరావుపేట మండలంలోని కేసానుపల్లి గ్రామ పరిధిలో 85.39 ఎకరాలు, జొన్నలగడ్డ 37.15, నరసరావుపేట 33.55, గుంటగార్లపాడు 39.85, రావిపాడు గ్రామ పరిధిలో 83.22 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. రొంపిచర్ల మండలం మాచవరం, విప్పర్ల, నకరికల్లు మండలం రూపెనగుంట్ల, చల్లగుండ్ల గ్రామాల్లో భూసేకరణ ప్రక్రియ జరుగుతోంది. 167ఏ జాతీయ రహదారి నిర్మాణం నకరికల్లు అడ్డరోడ్డు వరకు విస్తరిస్తారు. ప్రస్తుతం ఉన్న అద్దంకి-నార్కట్‌పల్లి రహదారికి అనుసంధానం చేస్తారు. పల్నాడు జిల్లాలో చిలకలూరిపేట మండలం కంతేటివారి కండ్రిక నుంచి నకరికల్లు అడ్డరోడ్డు వరకే భూసేకరణ జరుగనున్నది. భూసేకరణ వేగవంతం చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. దీనిని రైతులు అడ్డుకుంటున్నారు. రైతుల రాస్తారోకోతో కొంత సమయం పల్నాడు రోడ్డులో ట్రాఫిక్ స్తంభించిపోయింది. నరసరావుపేట తహసీల్దార్ వేణుగోపాలరావు, హైవే అధికారులు రైతులతో చర్చించారు.



రాస్తారోకో చేస్తున్న రైతులు

వీవీఐటీలో క్రమశిక్షణతో కూడిన విద్య



వీవీఐటీలో విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న విద్యాసాగర్

పెదకాకాని, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వీవీఐటీ కళాశాల 17వ వార్షిక వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు తాము కళాశాలలో గడిపిన ఆనంద క్షణాలను, మధురానుభూతులను పంచుకోవటమేగాక ప్రస్తుత విద్యార్థులకు విద్యానంతరం విషయాలు, ఉద్యోగ కల్పనకు కావాల్సిన అంశాలను వివరించారు. అనంతరం వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపల్ వై.మల్లికార్జునరెడ్డి 2023-24 విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు. ఈ ఏడాది మెరుగైన ఉత్తీర్ణతా శాతాన్ని సాధించిన విభాగం కంప్యూటర్సైన్స్ అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్(సి.ఎస్.ఎమ్) అకడమిక్స్ టాపర్‌గా, విద్యాయేతర (క్రీడ, సాంస్కృతిక) అంశాలనందు ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విభాగం కంప్యూటర్ సైన్స్- ఐ.ఓ.టి అండ్ సైబర్ సెక్యూరిటీ విత్ బ్లాక్చైన్ టెక్నాలజీ (సి.ఐ.సి) రోలింగ్ షీల్డ్ లను దక్కించుకున్నాయి. చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ వీవీఐటీ సంపూర్ణ క్రమశిక్షణ - సంపూర్ణ విద్య నినాదముతో క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తుందని తెలిపారు. వేడుకలలో విభిన్న సంప్రదాయాల వస్త్రధారణతో విద్యార్థులు ప్రదర్శించిన ' సంప్రదాయ నడక' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కళాశాల అధ్యాపకులచే అవినీతికి దూరంగా ఉండాలన్న ఉన్నత లక్ష్యం దగ్గరలో ఉందా? సుదూరంలో ఉందా? అంటూ ప్రదర్శించిన 'పెండింగ్ ఫైల్' నాటకం విద్యార్థులను ఆలోచింపజేసేలా సాగింది. కార్యక్రమంలో డీన్ ఆఫ్ అకడమిక్ కె.గిరిబాబు, డీన్ ఆఫ్ అడ్మిన్ ఎన్.కుమారస్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయండి

- అధికారులకు సూచించిన జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు
- పులిపాడులో హెలిప్యాడ్ స్థల పరిశీలన



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

గురజాలటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జనవరి 1వ తేదీన నిర్వహించనున్న మండలంలోని పులిపాడు పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులకు సూచించారు. సోమవారం పులిపాడు గ్రామంలో ఆయన పర్యటించి సీఎం చంద్రబాబు హెలిప్యాడ్ ల్యాండింగ్‌కు గ్రామంలోని టీటీడీ కల్యాణ మండపం సమీపంలోని అనువైన ప్రాంతాన్ని గుర్తించారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ అధికారులు కమిటీలుగా ఏర్పడి కార్యక్రమానికి విచ్చేసే ప్రజలకు మంచినీరు, స్నాక్స్ అందేలా చూడాలన్నారు. సీఎం చంద్రబాబు గ్రామానికి వచ్చేసరికి 99 శాతం పింఛన్ల పంపిణీ పూర్తవ్వాలన్నారు. వృద్ధాప్య, వితంతు పింఛన్‌లను సీఎం చంద్రబాబు అందిస్తారని చెప్పారు. ట్రాఫిక్, వాహనాల పార్కింగ్‌లపై పోలీసు అధికారులకు సూచనలు చేశారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. ఈ కార్యక్రమంలో నాగార్జున సాగర్ కుడి కాలువ ప్రాజెక్ట్ చైర్మన్ పులుకూరి కాంతారావు, జేసీ సూరజ్ గనోరే, జిల్లా అడిషనల్ ఎస్పీ సంతోష్, గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, తహసీల్దార్ నగేష్, సీఐ భాస్కర్, ఎస్ఐ వినోద్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, మద్దినేని లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జనవరి నుంచి రాజధాని నిర్మాణ పనులు ప్రారంభం

- సీఎఫ్ఎంఎస్‌తో సంబంధం లేకుండా మున్సిపాలిటీలకే నిధులు
- భవన నిర్మాణాలకు 15 రోజుల్లోనే అనుమతులు
- పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ

పెదకాకాని, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.62 వేల కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేశామనీ, అందులో తొలివిడతగా వచ్చే సుమారు రూ.47 వేల కోట్లతో జనవరి నుంచి పనులు చేపట్టడానికి కార్యాచరణ సిద్ధం చేసినట్లు పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. సోమవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డైక్ మెన్ ఆడిటోరియంలో జరిగిన మున్సిపల్ కమిషనర్ల, ఇంజినీర్ల రాష్ట్ర వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి పనులు చేపట్టే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేకపోవడం వలన అభివృద్ధి పనుల్లో జాప్యం ఏర్పడుతుందన్నారు. సీఎఫ్ఎంఎస్‌కి గత ప్రభుత్వం ప్రజల సొమ్ము సుమారు రూ.3200 కోట్లు తరలించిందన్నారు. వచ్చే ఏప్రిల్ 1 నుంచి సీఎఫ్ఎంఎస్‌తో సంబంధం లేకుండా మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలు తమ నిధులను తామే అభివృద్ధి పనులకు ఖర్చు చేసుకునేలా ముఖ్యమంత్రి అనుమతి ఇచ్చారని తెలిపారు. కమిషనర్లు రానున్న 3 ఏళ్లలో ప్రజలకు తాగునీరు, వీధి దీపాలు, రోడ్లు, డ్రైన్లు, సాలీడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, వర్షం నీటి నిర్వహణపై డీపీఆర్‌ను 20 రోజుల్లో అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. రాష్ట్రంలోని 28 లక్షల స్వయం సహాయక సభ్యుల ఆదాయాలను రానున్న కాలంలో రెట్టింపు చేయడానికి ముఖ్యమంత్రి ఆలోచన చేస్తున్నారని, అందుకోసమే గతంలో ఎన్నడూ లేనివిధంగా మెప్మా విభాగానికి ఐఏఎస్ అధికారిని నియమించినట్లు తెలిపారు. రాష్ట్రంలో జనవరి నుంచి సింగిల్ విండో ద్వారా 15 రోజుల్లోనే భవన అనుమతులు జారీ జరుగుతుందన్నారు. నిర్మాణంలో నిబంధనల ఉల్లంఘన జరిగితే ఇంజినీర్ లైసెన్స్ రద్దుతోపాటు చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామన్నారు. మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులు వేగంగా చేపట్టడం ద్వారా త్వరలోనే రాష్ట్ర మున్సిపాలిటీలను దేశంలోనే అత్యుత్తమ మునిసిపాలిటీలుగా తీర్చిదిద్దుకుందామన్నారు. పురపాలక శాఖ కార్యదర్శి కె.కన్నబాబు మున్సిపాలిటీలో తాగునీరు, రోడ్లు, డ్రైయినేజీ, వీధి దీపాలు, పన్నుల వసూళ్లు తదితర అంశాలపై తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వర్క్‌షాప్‌లో మెప్మా ఎండీ, సీడీఎంఏ(ఇంచార్జి) ఎన్.తేజ్ భరత్, విశాఖపట్నం కమిషనర్ సంపత్ కుమార్, గుంటూరు కమిషనర్ పులి శ్రీనివాసులు, కాకినాడ కమిషనర్ భావన, ఈఎన్సీ డి.మరియన్న, రాష్ట్రంలోని కార్పొరేషన్ల, మున్సిపాలిటీల కమిషనర్లు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ జీవోనూ.. పట్టించుకోవడం లేదు

(5వ పేజీ తరువాయి)

ఆ భారాన్ని మోయాల్సి వచ్చింది. ప్రస్తుతం రాష్ట్రంలో పండుగల సీజన్ నడుస్తోంది. క్రిస్మస్, సంక్రాంతి పండుగల సందర్భంగా వాహన విక్రేతలు డిస్కౌంట్లు, రాయితీలు ప్రకటిస్తారు. అలాంటి సమయంలో వినియోగదారులు వాహనాలు కొనేందుకు ఆసక్తి చూపుతారు. అలాంటి సమయంలో కూడా ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు అందకపోవడంతో వినియోగదారులు తిరుగుముఖం పడుతున్నారు.

వినియోగదారులకూ రాయితీ..

తాజా పాలసీలో రాష్ట్ర ప్రభుత్వం 12 శాతంగా వున్న రోడ్ ట్యాక్స్‌ను మినహాయించింది. దాంతో పాటు వాహనం ఖరీదులో 5 శాతం డిస్కౌంట్ లభిస్తుంది. తద్వారా లక్షకు రూ. 5వేలు చొప్పున వినియోగదారుడికి కలిసి వస్తుంది. లక్ష రూపాయల లోపు ఉన్న ఈ- ద్విచక్ర వాహనాలకు, రూ. 2 లక్షల లోపు ధర ఉన్న ఈ- 3 వీలర్స్‌కు, ఐదు లక్షలలోపు ధర ఉన్న సరుకు ఈ- రవాణా వాహనాలకు, రూ. 8 లక్షల లోపు ధర ఉన్న ఈ- ట్రాక్టర్లు, రూ. 2 కోట్ల లోపు ధర ఉన్న ఈ- బస్సులకు ఈ రాయితీ లభిస్తుంది. దాంతో పాటు స్క్రాప్ సర్టిఫికెట్ ఇస్తే వినియోగదారుడికి మరో 10 శాతం రాయితీ లభిస్తుంది. జీవో అమలులోకి రాకపోవడంతో వినియోగదారుడు ఆ రాయితీలన్నీ కోల్పోవాల్సి వస్తోంది. దీనిపై రవాణా శాఖ అధికారులను వివరణ కోరగా జీవో ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ విభాగం వారు జారీ చేసిందని, రవాణా శాఖ ప్రిన్సిపుల్ సెక్రటరీ జీవో జారీ చేసిన తరువాతే అది అమలులోకి వస్తుందని చెబుతున్నారు. జీవో గడువు ముగిసినరోజు అర్ధరాత్రి 12 గంటల నుంచే రోడ్ టాక్సును అమలులోకి తెస్తున్న రవాణా శాఖ, జీవో వచ్చి 15 రోజులు పూర్తయినా ఇప్పటికీ దాన్ని అమలు చేయకపోవడంపై వినియోగదారుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

ఎస్సీ కులాల ఉప వర్గీకరణపై అభిప్రాయ సేకరణ

- ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా రాక
- 30న జిల్లా అధికారులతో సమావేశం
- కుల సంఘాల నుంచి వినతుల స్వీకరణ



గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ (షెడ్యూల్డ్ కులాల) ఉప వర్గీకరణపై వివిధ వర్గాల అభిప్రాయాన్ని సేకరించేందుకు ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా జిల్లా పర్యటనకు రానున్నారు. ఈ నెల 30న ఉదయం 10 గంటలకు జిల్లాకు చేరుకొని వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశం అవుతారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎస్సీ సంఘాల నాయకుల నుంచి ఉప వర్గీకరణపై అభిప్రాయాలు, వినతిపత్రాలను స్వీకరిస్తారు. మధ్యాహ్న భోజన విరామం అనంతరం విజయవాడ వెళ్తారు. ఇక్కడ వినతిపత్రాలు ఇవ్వలేకపోయినా ప్రజలు ఈమెయిల్ ద్వారా కూడా పంపే అవకాశం కల్పించారు. అలానే విజయవాడలో ఉన్న కార్యాలయంలోనూ అందజేయవచ్చు. ఎస్సీ వర్గీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరించాయి. అలానే సుప్రీంకోర్టు కూడా ఎలాంటి నిలుపుదల ఉత్తర్వులు జారీ చేయలేదు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్సీ కులాల ఉప వర్గీకరణపై విచారణ జరిపి నివేదిక సమర్పించేందుకు రిటైర్డు ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రాని నియమించింది. గత నెల 15న దీనికి సంబంధించి ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. విజయవాడలోని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడి కార్యాలయం మొదటి అంతస్తులో కమిషన్ ఆఫీసు కూడా ఏర్పాటు చేశారు. కమిషన్ ఇప్పటికే రాతపూర్వక వినతులను స్వీకరిస్తుంది. జనవరి 9వ తేదీ సాయంత్రం వరకు అర్జీలను వ్యక్తిగతంగా, రిజిష్టర్ పోస్టు ద్వారా పంపే అవకాశం కల్పించారు. అర్జీలను కమిషన్ మెయిల్ ఐడీ omcscsubclassification@gmail.com కూడా పంపవచ్చని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెలిపారు.

మా స్థలాన్ని కబ్జా చేశారు


- వైసీపీ నేత ప్రేమ్ కుమార్ ఆగడాలపై మరో ఫిర్యాదు

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మెడలో టీడీపీ కండువా కప్పుకొని గ్రామీణ ప్రాంత రోడ్లలో వాహనాల నుంచి టోల్ ఫీజు వసూలు చేస్తూ రీల్స్ చేసి సోషల్ మీడియాలో అప్లోడ్ చేసి ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్న కేసులో కర్నూలు పోలీసులు అరెస్టు చేసిన వైసీపీ నాయకుడు కొరిటిపాటి ప్రేమ కుమార్ ఆగడాలపై సోమవారం ఎస్పీకి మరో ఫిర్యాదు అందింది. చిన్ని ట్రావెల్స్ నిర్వాహకుడు ఖరీదు నాగ కుమార్ ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. 2018 నుంచి ఏఈఎల్‌సీ అధ్యక్షుడు బెనర్జీ, ట్రెజరర్ రాజరత్నం నుంచి రమేష్ హాస్పటల్ పక్కన ఉన్న హైయర్ హాల్ కాంపౌండ్‌లో 1450 చదరపు గజాల స్థలాన్ని తన భార్య సుమ పేరుతో లీజుకు తీసుకొని అందులో చిన్ని ట్రావెల్స్ కార్యాలయాన్ని, అదేవిధంగా ఆయా వాహనాలకు పార్కింగ్ గా ఉపయోగించుకుంటున్నామని నాగ కుమార్ పేర్కొన్నారు. అయితే కొరిటిపాటి ప్రేమ్‌కుమార్ గత ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని తనను, తన భార్యను బెదిరించి దౌర్జన్యంగా స్థలాన్ని కబ్జా చేసి అందులో రేకుల షెడ్డు వేశాడన్నారు. అందులో ప్రేమ్ కుమార్‌తోపాటు ఆయన అనుచరులు గంజాయి, మద్యం, అసాంఘిక కార్యకలాపాలు చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో తమను తీవ్రంగా ఇబ్బందులు పెట్టారనీ, ఎన్నిసార్లు జిల్లా ఎస్పీ కార్యాలయంలో, నగరంపాలెం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.


గిరిజనుల అభివృద్ధే కూటమి లక్ష్యం

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు దారు నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో జగన్‌రెడ్డి గిరిజన ఏజెన్సీ ప్రాంతంలో రోడ్లు, విద్య, వైద్యం వంటి కనీస సదుపాయాలు కల్పించలేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వం మద్యం ఆదాయం పేరిట ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెట్టి రుణాలు తెచ్చినా అభివృద్ధి మాత్రం శూన్యం అన్నారు. వెనకబడిన జిల్లాలకు కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రూ.350 కోట్లు ఇస్తే, గత వైసీపీ ప్రభుత్వం నిధులను దారి మళ్లించిందన్నారు. దీంతో వెనకబడిన జిల్లాలు మరింత వెనకబడ్డాయన్నారు. గిరిజన ప్రాంతాలను కూటమి ప్రభుత్వం పర్యాటకంగా అభివృద్ధి చేయటం ద్వారా గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించనుందన్నారు. రాష్ట్రంలో ఏడు ఐటీడీఏల పరిధిలో 9031 గిరిజన గ్రామాలు ఉండగా వాటిలో 2162 పల్లెలకు ఇప్పటికీ రహదారి సదుపాయం లేదన్నారు. కూటమి ప్రభుత్వం గిరి పుత్రుల వైద్య సదుపాయం కోసం ఏజెన్సీలలో డోలి మోతకు స్వస్తి పలకడానికి కరడవలసలో కంటైనర్ ఆస్పత్రిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కారు ఢీకొని అన్నదమ్ములు మృతి



గురవయ్య(ఫైల్)



భీమరాజు (ఫైల్)

వినుకొండ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో పసుపులేరు బ్రిడ్జి వద్ద ప్రతాపుల గురవయ్య (55) మృతి చెందగా, ప్రమాదంలో గాయపడి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న గురవయ్య తమ్ముడు భీమరాజు(52) ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గురవయ్య, భీమరాజు అన్నదమ్ములు. ఇద్దరూ వినుకొండ మున్సిపాల్టీలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆదివారం సెలవు రోజు కావడంతో పసుపులేరు బ్రిడ్జి వద్ద వాగు వెంబడి ఉన్న జీవాలను(పందులు) చూసుకునేందుకు ద్విచక్రవాహనంపై వెళ్లారు. తిరిగి ద్విచక్రవాహనంపై వినుకొండకు బయలుదేరుతుండగా, వేగంగా వచ్చిన కారు బ్రిడ్జి వద్ద వీరిని ఢీకొట్టింది. ప్రతాపుల గురవయ్య అక్కడికక్కడే మృతి చెందగా, తమ్ముడు భీమరాజు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. గురవయ్యకు భార్య సాంబ, నలుగురు కుమార్తెలు ఉండగా ముగ్గురికి వివాహం జరిపించారు. భీమరాజుకు ఐదుగురు సంతానంలో నలుగురు కుమారులు, ఒక కుమార్తె కలరు. సంతానంలో అందరికీ వివాహం జరిపించారు. మృతి చెందారనే సమాచారం మేరకు బంధువులు పెద్ద ఎత్తున వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు చేరుకున్నారు. కారు యజమాని మద్యం తాగిన కారణంగా ప్రమాదం జరిగిందని మృతుల కుటుంబ సభ్యులు ఆరోపించారు. న్యాయం జరిగేంత వరకు మృతదేహాలను తరలించబోమని కొంతసేపు స్తూపం సెంటర్‌లో భీష్మించుకొని కూర్చొన్నారు. పెద్దల సమక్షంలో రాజీ కుదరడంతో బంధువులు శాంతించి మృతదేహాలను తీసుకెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శోభనబాబు తెలిపారు.

అన్నదాతంటే.. అలుసా

- జాతీయ రైతు దినోత్సవం మనోళ్ళకి గుర్తు లేదు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

దేశానికి రైతే వెన్నెముక.. అంటూ రాజకీయ పార్టీల నేతలు ఊదర గొడతారు. అయితే జాతీయ రైతు దినోత్సవాన్ని వారు విస్మరించడం విమర్శలకు తావిస్తోంది. ప్రతి ఏటా డిసెంబరు 23ను రైతుల దినోత్సవంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. జాతీయ, ప్రపంచ దినోత్సవాలను నిర్వహించే నేతలకు రైతు దినోత్సవం గుర్తుకు రాకపోవడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో ఎక్కడా జాతీయ రైతు దినోత్సవాన్ని నేతలు నిర్వహించిన దాఖలాలు లేవంటే వారి పట్ల వారికి ఎంత ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చనే విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో వినూత్నంగా పంటలు పండిస్తున్న రైతులను గుర్తించి రైతు దినోత్సవం సందర్భంగా వారిని సత్కరిస్తే ఆదర్శ రైతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఈ దిశగా ప్రోత్సాహం లేకపోవడం పట్ల రైతు వర్గం అసంతృప్తిని వ్యక్తం చేస్తోంది. ఒకరిద్దరు నాయకులు మాత్రం రైతులకు శుభాకాంక్షలు తెలుపడం గమనార్హం.

ఎంఎస్‌వో-2 పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు(విద్య), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో సీవీ రేణుక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తూ 55 సంవత్సరాలు వయసు ఉండి, పీజీడీసీఏ, డీసీఏ డిప్లొమా కలిగి ఉండాలని సూచించారు. అర్హులైన వారు ఈనెల 31లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం smgrashikshaguntur.blogspot.com అనే వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

ఎల్‌టీ, ఎఫ్ఎన్‌వో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

గుంటూరు మెడికల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గ్రేడ్-2 ల్యాబ్ టెక్నీషియన్లు, ఎఫ్ఎన్‌వోలుగా పని చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు 5, ఎఫ్ఎన్‌వో పోస్టులు 14 భర్తీ చేస్తున్నట్లు ఆమె వివరించారు. అర్హులైన, ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను జనవరి ఏడో తేదీలోపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అందజేయాలని ఆమె తెలిపారు. ఈ పోస్టుల భర్తీకి సంబంధించిన పూర్తి వివరాలకు ఆరోగ్య శాఖ కార్యాలయంలో సంప్రదించాలని డీఎంహెచ్‌వో సూచించారు.

టీబీ కార్యాలయంలో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్

గుంటూరు మెడికల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా జాతీయ క్షయ నిర్మూలన పథకంలో జిల్లా క్షయ నియంత్రణ విభాగంలో ఏడాది పాటు కాంట్రాక్ట్ విధానంలో పని చేసేందుకు పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాట్స్ ప్లస్ టీబీ-హెచ్ఐవీ సూపర్‌వైజర్ (ఒక పోస్టు), డ్రగ్ రెసిస్టెన్స్ సెంటర్ టీబీ స్టాటిస్టిక్స్ అసిస్టెంట్ (ఒక పోస్టు), ఫుల్‌టైమ్ అకౌంటెంట్ (ఒక పోస్టు), టీబీహెచ్‌వీ (రెండు పోస్టులు), జిల్లా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ (ఒక పోస్టు)కు సంబంధించి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు. అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను జనవరి ఐదులోపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఈ పోస్టులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారిని సంప్రదించాలని సూచించారు.

నేడు సర్టిఫికెట్ల పరిశీలన

గుంటూరు(విద్య),డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో పనిచేసే సెకండరీగ్రేడ్, స్కూల్ అసిస్టెంట్స్ పదోన్నతుల కోసం ఈనెల 24న సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తున్నట్లు డీఈవో సీవీ రేణుక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఉపాధ్యాయులు ఉదయం 11 గంటలకు డీఈవో కార్యాలయంలో జరిగే సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలని సూచించారు. సీనియార్టీ జాబితాను deognt.blogspot.com అనే వెబ్‌సైట్‌లో పొందుపరచినట్లు తెలిపారు.

బజరంగ్ జూట్ మిల్లులో అక్రమాలపై పోరాడుతున్నందుకు హత్యాయత్నం

- ఎస్పీకి పిల్లి బాబురావు ఫిర్యాదు

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బజరంగ్ జూట్ మిల్లుకు సంబంధించిన స్థలాలను వైసీపీ నాయకులు అంబటి రాంబాబు, ఆయన సోదరుడు మురళి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న విషయంపై తాను పోరాడుతున్నందుకు తనపై హత్యాయత్నం జరిగిందని కార్మిక సంఘ నాయకుడు పిల్లి బాబురావు సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించాడు. బజరంగ్ జూట్ మిల్లు లాభాల్లో 40 శాతం కార్మికులకు వాటా రావాల్సి ఉందన్నారు. దానికి సంబంధించి కోట్లాది రూపాయలు కార్మికులకు రావాల్సి ఉండగా, మిల్లులో 60 శాతం వాటాదారుగా ఉన్న లునాని ఆ మొత్తం చెల్లించలేదన్నారు. అంతేగాక చట్ట నిబంధనల ప్రకారం బజరంగ్ జూట్ మిల్ ఆస్తులను విక్రయించడానికి గాని, కొనుగోలు చేయడానికి కానీ ఎవరికీ హక్కు లేదన్నారు. అయినప్పటికీ 2009లో రెండున్నర ఎకరాలు, అలాగే 2015లో ఐదున్నర ఎకరాలను అంబటి సోదరులు అక్రమంగా నల్లపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. దీనిపై తాను హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసి పోరాటం చేస్తున్న నేపథ్యంలో తనను కేసు ఉపసంహరించుకోవాలని వైసీపీ నేతలు అంబటి బ్రదర్స్‌తోపాటు కొందరు టీడీపీ నాయకులు కూడా ఒత్తిడి తెచ్చారన్నారు. ఆ కేసు విషయంలో తాను వారి మాట వినకపోవడంతో ఈనెల మూడున తాను ఓవర్ బ్రిడ్జిపై నడుచుకుంటూ వెళుతుండగా ఆటోలో వచ్చిన గుర్తుతెలియని దుండగులు తనను పైనుంచి కిందకు పడేయాలన్న ఉద్దేశంతో కాళ్లతో తన్నారన్నారు. దీంతో ఫుట్‌పాత్‌పై పడిపోవడంతో చేతి భుజం వద్ద విరిగిందన్నారు. బజరంగ్ జూట్ మిల్ అక్రమాలపైనా, హత్యాయత్నంపైనా కేసులు నమోదు చేయాలని ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో కోరారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 576.20 అడుగులు ఉంది. ఇది 272.17 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8144 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6022, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30114 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 46,980 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి 21,637 క్యూసెక్కుల నీరు వస్తుంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.90
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	98,107,118
చికెన్ విత్ స్కిన్	190.00
చికెన్ స్కిన్ లెస్	200.00

60,866 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 65,687 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 60,866 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 49,236 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	14500	334	8000	14500
నెంబరు. 5	8500	12500	నెంబరు.5	8500	13500
273	11200	11500	273	11000	11000
341	8000	14800	341	8000	14100
4884	--	--	4884	10700	10700
సూపర్ 10	10000	10000	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8000	16000	తేజ	8000	16500
బ్యాడిగి	8000	13500	బ్యాడిగి	8400	12000
దేవనూరు డీలక్స్	9000	15000	దేవనూరు డీలక్స్	8500	15500
తెల్లకాయలు	4000	10500	తెల్లకాయలు	4500	10000

పులిచింతల సమాచారం

అచ్చంపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 40.27 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందని ఆయన తెలిపారు.

బోగస్ హాజరు వేస్తే జైలుకే

● డ్వామా పీడీ ఎం.సిద్దా లింగమూర్తి

రెంటచింతల,డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) :జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా మస్టర్లలో బోగస్ హాజరు వేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని, అందుకు క్షేత్ర స్థాయి సిబ్బంది బాధ్యులవుతారని డ్వామా పీడీ ఎం.సిద్దా లింగమూర్తి హెచ్చరించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ నిర్వహించిన వివిధ పనులకు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ ఉద్యోగులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే కుదరదని, అక్రమాలను కట్టడి చేయాల్సిన బాధ్యత ఎంపీడీవో, ఏపీవోలదేనని, వారానికి రెండు రోజులు గ్రామాల్లో జరుగుతున్న పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. అక్రమాలపై ఫిర్యాదు వస్తే విచారించి చర్యలు చేపడతామన్నారు. అలాగే వివిధ పనుల్లో లక్ష 7 వేల 824 రూపాయల రికవరీకి ఆదేశించారు. 1 లక్ష 64 వేల, 864లకు సంబంధించిన పనులను తనిఖీ చేసి వెంటనే నివేదిక ఇవ్వాల్సిందిగా ఏపీడీని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కే.సరోజనిదేవి, ఎస్ఆర్పీ జేఎస్.రాజు, విజిలెన్స్ ఆఫీసర్ విజయకుమారి, ఏపీవో జయచంద్ర, ఏఈలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.


పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్ఓ శ్రీనివాసరావును కలసిన ఎస్ఐ అమీర్

అమరావతి పీఎస్
ఎస్ఐగా అమీర్

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) అమరావతి పోలీసు స్టేషన్‌లో రెండవ ఎస్ఐగా కే అమీర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయినింగ్ రిపోర్టును ఎస్‌హెచ్‌వో ఎం. శ్రీనివాసరావుకు అందజేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు స్పెషల్ బ్రాంచి నుంచి బదిలీపై అమరావతి ఎస్ఐగా అమీర్ నియమితులయ్యారు.

జడ్పీ హైస్కూల్‌కు
సౌండ్ సిస్టమ్ అందజేత

పెదకూరపాడు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 75 తాళ్ళూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు ఎంఎల్‌టీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10వేలు విలువ చేసే సౌండ్ సిస్టమ్‌ను సోమవారం ప్రధానోపాధ్యాయులు ఎం శ్రీనివాసరెడ్డికి అందించారు. గ్రామానికి చెందిన మల్లవరపు ఆరోగ్యయ్య, కే జయరాజులు ఈ సౌండ్ సిస్టాన్ని అందించారు.

రైతు సేవా కేంద్రాల్లో
ధాన్యం కొనుగోలు

మాచర్ల రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తోందని ఏవో లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కంభంపాడులో రైతులు పండించిన ధాన్యంను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ధాన్యం క్వింటాకు రూ. 2320లను చెల్లించడంతోపాటు గోనే సంచులు, రవాణా ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. రైతులు తమ ఆధార్ నంబరుతో రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకొని ధాన్యం శాంపిల్స్‌ను అందించాలని ఏవో లక్ష్మారెడ్డి రైతులకు వివరించారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ సిబ్బంది, పలువురు రైతులు ఉన్నారు.

పెరిగిన హుండీ ఆదాయం

రెంటచింతల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సత్రశాల ఆలయ హుండీ ఆదాయం కిందటేడాది కన్నా ఈ ఏడాది రూ.73,500 పెరిగినట్లు ఎండోమెంట్ సత్తెనపల్లి ఇన్స్‌పెక్టర్ లీలావతి తెలిపారు. కొబ్బరి కాయలు, లడ్డు ప్రసాదం, కొబ్బరి చిప్పలకు సోమవారం వేలం నిర్వహించగా రూ.4,42,500, శివాలయం కార్తీక మాస హుండీ ఆదాయం రూ.11,388 వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ పల్లెర్ల లక్ష్మారెడ్డి, ఈవో గాదే రామిరెడ్డి, పూజారి శర్మ, శివయ్య, లింగయ్య, నీలం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్లకు దుస్తులు పంపిణీ


రెంటచింతల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం రెంటచింతలలోని 50 కుటుంబాలకు చెందిన పాస్టర్లకు (100 మందికి) ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పంపించిన దుస్తులను టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి సోమవారం అందచేశారు. కార్యక్రమంలో పాస్టర్ ఐజాక్,మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు సుమంత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు రాజారెడ్డి, బోడపాటి రామకృష్ణ, ప్రభురాజు, మామిడి రవి, దానయ్య, జ్ఞానయ్య, సామ్యేల పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

పిడుగురాళ్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపట్ల యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శివనాగరాజు సూచించారు. సోమవారం స్థానిక తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థలలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసై శివనాగరాజు మాట్లాడుతూ వ్యక్తిగత సమాచారంతో పాటు ఫోన్ నెంబరు, ఆధార్, బ్యాంక్ అకౌంట్, పాన్ నెంబర్, ఫొటోలను గుర్తుతెలియని వ్యక్తులకు ఇవ్వొద్దని సూచించారు. కార్యక్రమంలో కొత్తపల్లి ప్రదీప్ ప్రిన్సిపాల్ నరేష్ ఫణికిషోర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

చర్చిలకు క్రిస్మస్ వెలుగులు

● వేడుకలకు సిద్ధమవుతున్న క్రైస్తవ ఆలయాలు
● వివిధ ప్రాంతాల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు


విద్యుత్ కాంతులతో సత్తెనపల్లి పట్టణంలోని బాప్టిస్ట్ చర్చి..

సత్తెనపల్లి, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగ నేపథ్యంలో క్రైస్తవులు పట్టణంలోని అన్ని చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రధానమైన లూథరన్, తెలుగు బాప్టిస్ట్, టౌన్, ఆర్‌సీఎం చర్చిలతో పాటు వివిధ ప్రాంతాల్లోని చర్చిలను సుందరంగా అలంకరించారు. క్రిస్మస్ సందర్భంగా నెలరోజుల నుంచే క్రైస్తవులు ఆయా చర్చిల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక ప్రార్ధనలు, సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్నారు. పట్టణంలోని క్రిష్టియన్‌పేట, వడ్డవల్లి, నాగన్నకుంట, వెంగళరెడ్డినగర్, అంబేద్కర్‌నగర్ తదితర ప్రాంతాల్లో క్రిస్మస్‌ను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. క్రైస్తవులు వారి గృహాలపై క్రీస్తు రాకను తెలుపుతూ స్టార్‌లను ఏర్పాటు చేశారు.

పట్టణంలోని ఎస్ఎస్‌పీ కార్యాలయంలో సోమవారం ఎస్ఎస్‌పీ ఉద్యోగులు సెమీ క్రిస్మస్ నిర్వహించారు.


పిడుగురాళ్ల తహసీల్దార్ కార్యాలయంలో ..

ఈఈ మురళీధర్ క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి ఉద్యోగులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అరుణ్, మరియదాసు, సాల్మన్‌రాజు, కృష్ణ, ఉద్యోగులు, లస్కర్లు పాల్గొన్నారు.

కారంపూడి, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో ఫాదర్ అనిల్ కుమార్ ఆధ్వర్యాన సెమీక్రిస్మస్ నిర్వహించారు. చిన్నారులు వేషధారణ, క్రిస్మస్ పాటలు అలరించాయి. అనంతరం కేక్‌ను కట్ చేశారు.కార్యక్రమంలో ఎంఈవో 2 రవికుమార్, ఫాదర్లు జక్కార్‌రెడ్డి, చందు, ప్రిన్సిపాల్ బి నోమా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాచవరం,(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కోయ రజని, కొత్తపాలెం సర్పంచ్ యామని రామారావులు ముఖ్య అతిథులుగా హాజరై కేక్‌కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో అన్నిగ్రామాల సమాఖ్య అధ్యక్షుడు, కార్యదర్శులు సీసీ సీతారామయ్య, కంప్యూటర్ ఆపరేటర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగురాళ్ల, (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో పిడుగురాళ్ల తహసీల్దార్ జే.మధుబాబు ముఖ్యఅతిథిగా


పెదకూరపాడు చర్చిలో నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు


కారంపూడి సెయింట్‌జాన్స్ హైస్కూల్లో సెమీ క్రిస్మస్..

హాజరయ్యారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుధాకరశర్మ, సర్వేయర్ శ్రీనివాసరావు, సీఎస్ డీటీ సుబ్బారావు, కార్యాలయ సిబ్బంది సురేష్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడు(ఆంధ్రజ్యోతి): ఆంధ్రాయువాంజికల్ లూథరన్ చర్చి ప్రాంగణంలో సెమీ క్రిస్మస్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ మత్తె నరేష్‌కుమార్ క్రీస్తు సందేశాన్ని వివరించారు. ముందుగా చిన్నారులు పలు నృత్య రూపకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో చర్చి డెలిగేట్ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు, (ఆంధ్రజ్యోతి): అందుకూరు ప్రాథమికోన్నత పాఠశాలలోని నిరు పేద విద్యార్థులకు కే రామకృష్ణారెడ్డి, సుమతి దంపతులు, వారి పిల్లలు క్రిస్మస్ బహుమతుల పేర దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జీ గోవిందరెడ్డి, ఉపాధ్యాయులు ధర్మారావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నకరికల్లు, (ఆంధ్రజ్యోతి): కుంకలగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ చల్లా వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎం పూజాశ్రీలు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ సాతులూరి లూథరన్ శాస్త్రి హెచ్‌వీ ప్రశాంతి, సీహెచ్‌వో కే వెంకటేశ్వర్లు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతి, సామరస్యమే ఏసు సందేశం

- పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) శాంతియుత జీవనం, మత సామరస్యమే ఏసు సందేశ సారాంశమని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. సోమవారం ధరణికోట గ్రామంలోని జైయిల్ సింగ్‌కాలనీలోని లూథరన్ చర్చిలో నిర్వహించిన సెమీ క్రిస్టమస్ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై క్రిస్మస్ కేక్ కట్ చేశారు.


సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం, రాష్ట్ర ప్రజలపైన ఏసు క్రీస్తు ఆశీర్వచనాలు ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని క్రైస్తవ సోదరులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు చెబుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో పాస్టర్ సత్యానందకుమార్, స్థానిక సంఘ పెద్దలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

● బాషా, వెల్దుర్తి తహసీల్దార్

ఫటాఫట్



వెల్దుర్తి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామ రెవెన్యూ సదస్సులను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వెల్దుర్తి మండల తహసీల్దారు బాషా సూచించారు. ఈ గ్రామ సదస్సుల్లో రైతుల నుంచి వచ్చిన అర్జీను సాధ్యమైనంత వేగంగా పరిష్కరించేదుకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. మండల పరిధిలో నిర్వహిస్తున్న గ్రామ రెవెన్యూ సదస్సుల గురించి ఆయనతో ఆంధ్రజ్యోతి ప్రతినిధి 'ఫటాఫట్..'

ప్ర: రెవెన్యూ సదస్సుల్లో ఇప్పటి వరకు మొత్తం ఎన్ని అర్జీలు వచ్చాయి?

జ: మండల పరిధిలో ఇప్పటి వరకు 120 అర్జీలు వచ్చాయి. ఇందులో 59 అర్జీలు రెవెన్యూ సమస్యలపై రాగా మిగిలినవి ఇతర సమస్యలకు సంబంధించి ఉన్నాయి. డీఎస్ (డిజిటల్ సిగ్నేచర్), రీప్లేస్‌మెంట్ పుస్తకాలకు వచ్చే అర్జీలకు అప్పటికప్పుడే పరిష్కారం చూపుతున్నాం. వచ్చే యేడాది ఫిబ్రవరి నాటికి స్వీకరించిన అర్జీలన్నింటినీ పూర్తిగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం.

ప్ర: రేషన్ డీలర్ల నియామకం నోటిఫికేషన్ రద్దుకు గల కారణాలు ఏమిటి?

జ: డీలర్ల రోటర్ పాయింట్ల వ్యత్యాసం వలన నోటిఫికేషన్ రద్దు చేశాం. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే నోటిఫికేషన్ విడుదల చేసి డీలర్ల నియామకం చేపడతాం.

ప్ర: రేషన్ అక్రమ తరలింపుపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా గట్టి చర్యలు చేపట్టాం. తనిఖీల్లో స్టాక్‌లో వ్యత్యాసం ఉన్నట్లు తేలితే కేసులు నమోదు చేస్తున్నాం.

రాజకీయాల్లో అపర చాణుక్యుడు పీవీ

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : భారత రాజకీయాల్లో అపర చాణుక్యుడు పీవీ నరసింహారావు అని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి కన్నా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మకమైన సంస్కరణలకు పీవీ నరసింహారావు బీజ మేశారన్నారు. కార్యక్రమంలో పలువురు కూటమి నేతలు, బ్రాహ్మణసంఘ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణ బ్రాహ్మణ సంఘ నేతలు కన్నాను సన్మానించారు.


పీవీ నరసింహారావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, కూటమి నేతలు

అయ్యప్పస్వామి ఆలయంలో ఎమ్మెల్యే కన్నా ప్రత్యేక పూజలు..

పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో సోమవారం జరిగిన సద్ది కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ కమిటీ నిర్వాహకులు కన్నాను ఘనంగా సత్కరించారు.


అమరేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

అమరేశ్వరుని సేవలో ఎస్పీ దంపతులు

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా సోమవారం అమరావతిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించారు. ఆలయానికి చేరుకున్న ఎస్పీ దంపతులను ఈవో సునీల్‌కుమార్, అర్చకులు శాస్త్రయుక్తంగా ఘన స్వాగతం పలికారు. ఎస్పీ శ్రీనివాసరావు దంపతుల పేరు మీద స్వామివార్లకు పూజలు, అభిషేకాలు నిర్వహించి ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఎస్పీ దంపతులు, వారి పిల్లలు ధ్యానబుద్ధ ప్రాజెక్టు, పురావస్తు సంగ్రాహాలయం, మహాచైత్యంలను సందర్శించారు. ఎస్పీ వెంట సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు, స్థానిక ఎస్‌హెచ్‌వో ఎం. శ్రీనివాసరావు, ఎస్ఐ రాజశేఖర్ పోలీసు స్పిబంది పాల్గొన్నారు.

ఉత్తమ గణిత ఉపాధ్యాయిని అంజనీ కుమారి

నకరికల్లు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దేచవరం మోడల్ స్కూలు గణిత ఉపాధ్యాయిని పంగులూరు అంజనీ కుమారిగా ఉత్తమ గణిత ఉపాధ్యాయినిగా ఎంపికై డిప్యూటీ డైరెక్టర్ ఎస్ అబ్రహం చేతుల మీదుగా ఉత్తమ పురస్కారాలను అందుకున్నారు. ఈనెల 22న రాజమండ్రిలో ఆంధ్రప్రదేశ్ మేథమ్యాటిక్స్ ఫోరం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. పేపర్ ప్రెజెంటేషన్ పోటీల్లో ఇన్నోవేటివ్ ఐడియాస్ ఇన్ టీచింగ్ మేథమేటిక్స్ అనే అంశంతో పాటు టీఎల్ఎంలో అంజనీకుమారి బహుమతులను అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆమెను ప్రిన్సిపాల్ వేళాంగిని మేరీ ఉపాధ్యాయులు అభినందించారు.

రామారావుకు భారత్ విభూషణ్ పురస్కార్

కారంపూడి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన భవిరిశెట్టి రామారావు సోమవారం వల్లూరు ఫౌండేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవంలో భారత్ విభూషణ్ పురస్కార్ అవార్డును అందుకున్నారు. శ్రీవాసవీ సేవా చలివేంద్రం, అన్నప్రసాద పంపిణీ వంటి సేవా కార్యక్రమాలను నిర్వహించినందుకు గాను రామారావుకు ఈ అవార్డు దక్కింది.

పుస్తకాలు.. విజ్ఞాన దీపాలు

● సెయింట్ జోసఫ్ హైస్కూల్ కరస్పాండెంట్ పీటర్ పాపయ్య
● 'ఎదిగే వయస్సులో బంగారు బాల్యం' పుస్తకం ఆవిష్కరణ
● హాజరైన విశ్రాంత డీజీపీ మరియకుమార్

రెంటచింతల,డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పుస్తకాలు దారి దీపాల్లాంటివని, ప్రతి విద్యార్థి పుస్తక పఠనానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సెయింట్ జోసఫ్ హైస్కూల్ కరస్పాండెంట్ పీటర్ పాపయ్య అన్నారు. సోమవారం పాఠశాల ఆడిటోరియంలో పూర్వ విద్యార్థి, విశ్రాంత డీజీపీ బండి మరియకుమార్ రచించిన 'ఎదిగే వయస్సులో బంగారు బాల్యం' అనే పుస్తకాన్ని పీటర్ పాపయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన మరియకుమార్ పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దుర్గా ప్రసాద్, శ్రీనివాసరావు, రాంబాబు, పాపారావు, ఫాతిమా మర్రెడ్డి, శౌరయ్య, తుమ్మా లూర్దు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

51 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు

సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల 1973 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సోమవారం పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. అప్పటి విద్యార్థులు ఇప్పుడు సీనియర్ సిటిజన్స్ కాగా, నాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని సంతోషంగా గడిపారు. పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ పీటర్ పాపయ్యతో కలిసి పాఠశాల ప్రస్తుత పరిస్థితి గురించి తెలుసుకున్నారు. పాఠశాల స్థాపించి 75 సంవత్సరాలవుతున్న సందర్భంగా ఫిబ్రవరిలో నిర్వహించే వేడుకకు కుటుంబ సమేతంగా హాజరు కావాలని పూర్వ విద్యార్థులైన విశ్రాంత డీజీపీ మరియకుమార్, తుమ్మా లూర్దురెడ్డి, సెబాస్టియన్, మరియన్న, కట్టమూరి నాగేశ్వరరావు,పేర్రెడ్డి, నాగభూషణచారి, కే.ఆంజనేయరెడ్డి, జే.దేవదాసు, ఎన్ కోటేశ్వరరావు తదితరులను ఆహ్వానించారు.


విశ్రాంత డీజీపీ మరియకుమార్ రచించిన బంగారు బాల్యం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పీటర్ పాపయ్య

గ్రీవెన్స్‌కు గైర్హాజరు

క్రోసూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని మండలంలోని అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. సోమవారం తహసీల్దార్‌కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమానికి కేవలం ముగ్గురు అధికారులు మాత్రమే హాజరయ్యారు. మండలంలోని అన్నిశాఖల అధికారులు గ్రీవెన్స్ కార్యక్రమానికి హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించాల్సి ఉండగా, సోమవారం ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో జీ.శ్రీనివాసరావు, ఎలక్ట్రికల్ ఏఈ బసవరాజు మాత్రమే హాజరయ్యారు. మండలంలో ముఖ్య శాఖల అధికారులైన పోలీసు, ఎక్సైజ్, వ్యవసాయ, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, స్టాంప్స్‌రిజిస్ట్రేషన్, మార్కెట్ యార్డు, ఎన్ఆర్ఈజీఎస్, వెలుగు కార్యాలయాల నుంచి గ్రీవెన్స్‌కు ప్రాతినిధ్యం లేకుండాపోయింది. ఇప్పటికైనా వారానికి ఒకసారి జరిగే గ్రీవెన్స్ కార్యక్రమానికి అధికారులందరూ హాజరయ్యే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


అడవి యాత్రలో జాజి, ఔత్సాహిక యాత్రికులు

నల్లమలలో అడవి యాత్ర

కారంపూడి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన పర్యావరణ వేత్త కొమెర జాజి సోమవారం పల్లె సృజన బృందం, రెండు తెలుగు రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఔత్సాహిక వంతులతో నలమల అడవిలో యాత్ర జరిపారు. సుమారు 5 గంటలపాటు సాగిన ఈ యాత్రలో ఔషధ మొక్కలను చూపి వాటి ప్రయోజనాలను జాజి వివరించారు. అడవిలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ప్రకృతి, అడవులను కాపాడుకుందాం అని ప్రతిజ్ఞ చేశారు.


ఆదర్శ రైతులను సత్కరిస్తున్న అధికారులు

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

అచ్చంపేట, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని ఏరువాక అగ్రి ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఎఫ్ పాం ఆధ్వర్యంలో శనివారం జాతీయ రైతు దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏరువాక ఎఫ్‌సీవో శిఖా నరసింహారావు మాట్లాడుతూ రైతు సమస్యలపై అనేక పోరాటలుచేసిన చౌదరిచరణ్‌సింగ్ జయంతిని జాతీయ రైతు దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, వైసీపీ మండల కన్వీనర్ చిలకా చంద్రయ్య, తిరువాయిపాటి ఆంజనేయులు, ఎస్ హరిత, పీ.రవి నాయక్, ఎం వెంకటేశ్వర్లుతో పాటు వివిధ గ్రామాలకు చెందిన 50 మంది రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదర్శరైతులైన చిగురుపాడుకు చెందిన మాజీ ఎంపీటీసీ పీ భాస్కరరావును సాగునీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాస రావులను ఘనంగా సత్కరించారు.

27న జాబ్‌మేళా

మాచర్లటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్చేంజ్, సీడాప్ ఆధ్వర్యాన పట్టణంలోని ఎస్‌కేబీఆర్ కళాశాలలో ఈనెల 27న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీకుమారి తెలిపారు. సోమవారం కళాశాలలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ విద్యార్హత కలిగి 18 నుంచి 50 సంవత్సరాల వయసు కలిగిన వారు, వారి బయోడేటా లేదా రెజ్యూమ్, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్స్, ఆధార్ జిరాక్స్‌లు, పాస్‌పోర్టు సైజు ఫోటోతో హాజరుకావాలన్నారు. వివరాలకు 7842747682, 9010585360 లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ఆక్రమణపై ఫిర్యాదు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పిడుగురాళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం కబ్జాను అరికట్టాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల భూములు పరిరక్షణ కమిటి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గంధం హరికృష్ణ, జొన్నలగడ్డ శ్రీనివాసరావులు కళాశాల ప్రాంగణంలో వేసిన మెటల్ రోడ్డును తొలగించాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర కార్యాదర్శి కే కృష్ణ, ఎంబీఎం షేక్ మౌలాలి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.


డాక్టర్ విద్యకు గడియారాన్ని అందిస్తున్న అజ్మల్లా, అల్లాభక్షు

సిమెంట్ బెంచీలు అందజేత

పెదకూరపాడు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆస్పత్రికి, మార్కెట్, ప్రధాన కూడళ్ళకు వచ్చే ప్రజలు ఇబ్బంది పడకూడదని సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేసినట్లు టీడీపీ నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జ్ షేక్ అజ్మల్లా అన్నారు. పెదకూరపాడులోని కూరగాయల మార్కెట్ సెంటర్, పాఠశాల, టీడీపీ కార్యాలయం, ప్రభుత్వ వైద్యశాల వద్ద మాజీ ఎంపీటీసీ షేక్ అబ్దుల్ హమీద్ జ్ఞాపకార్థం వారి కుమారులు, క్లస్టర్ ఇన్‌చార్జ్ షేక్ అజ్మల్లా, షేక్ అల్లాభక్షులు సోమవారం ఐదు సిమెంట్ బెంచీలను ఏర్పాటుచేశారు. అలాగే సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ విద్యకు గోడ గడియారాన్ని అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ విద్య మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగులకు బెంచీలు ఎంతో ఉపయోగపడతాయని, ఆస్పత్రికి కావాల్సినటువంటి కొన్ని వస్తువులను ఇచ్చేందుకు దాతలు ముందుకు రావటం అభినందనీయమన్నారు.

పెదరామయ్యకు ఘన నివాళులు

దుర్గి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు యాగంటి పెదరామయ్య పెదకర్మను సోమవారం మండల కేంద్రమైన దుర్గిలోని ఆయన నివాసం వద్ద నిర్వహించారు. మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి హాజరై పెదరామయ్య చిత్రపటంకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధిక సంఖ్యలో ప్రముఖులు, ప్రజలు హాజరై నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరుమామిళ్ల మధుబాబు, సీనియర్ నేత, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, పెదరామయ్య కుమారుడు యాగంటి వెంకటేశ్వర్లు, పంగులూరి అంజయ్య, పుల్లయ్య, మాగులూరి నారయ్య, మేకల దాసు, జానకి రామయ్య, కూనిశెట్టి వెంకటేశ్వర్లు, రుద్రాల రవి, గుమ్మా వెంకటేశ్వర్లు, సూరే వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


పెదరామయ్యకు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి తదితరులు

క్రైమ్ జోన్

ఇసుక లారీ స్వాధీనం

మాచర్లటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం పట్టణంలో ఎస్ఐ సంధ్యారాణి వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఏపీ 37టీడీ 5666 నంబరుగల లారీని నిలిపి తనిఖీచేశారు. ఎటువంటి బిల్లులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించి లారీని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం లారీని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ సంధ్యారాణి తెలిపారు.

యువకుడిపై ఫోక్సో కేసు..

మాచర్లటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఓ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న యువకుడిపై సోమవారం పట్టణ పోలీసులు ఫోక్సో కేసు నమోదు చేశారు. పట్టణంలోని ఒక వార్డుకు చెందిన మైనర్ బాలిక పట్ల అదే వార్డుకు చెందిన యువకుడు నిత్యం అసభ్యంగా ప్రవర్తిస్తుండడంతో ఆ బాలిక తల్లిదండ్రులు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆ యువకుడిపై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ సంధ్యారాణి తెలిపారు.

సినీ ప్రముఖులకు తెనాలి పాదరక్షలు !


వెంకటేశ్వరరావు ఏర్పాటు చేసుకున్న చెప్పుల దుకాణం

సినీ పరిశ్రమల్లో పవర్‌స్టార్‌గా, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్‌కల్యాణ్ ధరించే చెప్పులు తెనాలి ప్రాంతంలో తయారు చేసినవే.. తెనాలికి చెందిన గుండపు వెంకటేశ్వరరావు పాదరక్షకలు తయారీలో నైపుణ్యం పొందారు. తాను నెర్చుకున్న వృత్తిలోనే రాణిస్తూ అభిమాన హీరోలకు మంచి మోడళ్లతో నాణ్యమైన పాదరక్షకలు ప్రత్యేకంగా తయారు చేసి వారికి అందజేసి ప్రశంసలు అందుకుంటున్నారు. తెనాలికి చెందిన పాదరక్షకుల తయారీదారుడు గుండపు వెంకటేశ్వరరావు సినీ హీరో, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మనస్సుకు చేరువయ్యాడు.


చెప్పులు తయారుచేస్తున్న వెంకటేశ్వరరావు

- పలు సినిమాల్లో కథానాయకులకు తయారీ
- పాత్రలకు తగ్గట్టు ప్రత్యేక డిజైన్లు..
- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మెచ్చిన చెప్పులు
- సినీ పరిశ్రమలో తెనాలి కీర్తిని చాటుతున్న గుండపు వెంకటేశ్వరరావు

తెనాలి రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తెనాలి గంగానమ్మపేటకు చెందిన గుండపు వెంకటేశ్వరరావు పాదరక్షకలు తయారుచేస్తూ జీవనం సాగించేవారు. రెండు దశాబ్దాలుగా సినీ పరిశ్రమలోని పలువురు కథానాయకులకు, రాజకీయ నాయకులకు వారు మెచ్చేలా పాదరక్షకులను తీర్చిదిద్దుతూ సినీ పరిశ్రమలో పరిచయం ఏర్పరుచుకున్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సినీ హీరో పవన్‌కల్యాణ్‌కు వెంకటేశ్వరరావు ప్రత్యేకంగా చెప్పులని తీర్చిదిద్ది అందజేశారు. కొద్దికాలంగా పవన్‌కల్యాణ్ అవే పాదరక్షలను ధరిస్తూ తన కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. పవన్‌కల్యాణ్ తనకు చెప్పులు కుట్టిన వెంకటేశ్వరరావుని సన్మానించి, అతడికి రూ.లక్ష చెక్కును అందజేసి అభినందించారు. తరువాత వెంకటేశ్వరరావు పాదరక్షకలు తయారీలో సినీ పరిశ్రమలో వెలుగులోకి వచ్చారు.

సినీ పరిశ్రమతో పరిచయం..

గతంలో సినీ పరిశ్రమలోని ఐశ్వర్య కాస్ట్యూమ్స్ డిజైనర్ దగ్గర పాదరక్షలు తయారుచేసే పనిలో వెంకటేశ్వరరావు ఉన్నారు. ఆ క్రమంలో సుమారు 20 సినిమాలకు పనిచేసి కథానాయకుల పాత్రలకు తగ్గట్లు పాదరక్షలు తయారు చేసి ఇచ్చారు. మొదటగా నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన గౌతమీపుత్ర శాతకర్ణి సినిమాకి వెంకటేశ్వరరావు పనిచేశారు. అనంతరం సినీ పరిశ్రమలోని ప్రముఖ హీరోలైన చిరంజీవి, రామ్‌చరణ్, ప్రభాస్, అల్లు అర్జున్, దుల్కర్‌సల్మాన్, మంచు విష్ణు, సాయిదుర్గాతేజ్ పలువురు నటించిన పాత్రలకు ఆయన పాదరక్షలను తయారుచేసి అందజేశారు.

పవన్‌కల్యాణ్‌పై అభిమానంతో..

పవన్‌కల్యాణ్‌పై ఉన్న అభిమానంతో ఆయనకు చెప్పులు కుట్టడం వల్ల తనకు ఇంత గుర్తింపు వచ్చిందని తను తయారుచేసిన చెప్పులతో నడుస్తూ అసెంబ్లీకి, పార్టీ కార్యక్రమాలకు వెళ్తుంటే తనకు చాలా ఆనందంగా ఉందని చెప్పారు. అంతేకాకుండా తనలోని నైపుణ్యాన్ని ప్రత్యేకంగా గుర్తించిన వ్యక్తి పవన్‌కల్యాణ్ అని చెప్పారు. తనకు ఇచ్చిన రూ.లక్షతో సొంతంగా షాపు పెట్టుకున్నానని తనను ఆదరించిన సినిమా పరిశ్రమకు రుణపడి ఉంటానని తెలిపారు.


చెప్పులు తయారు చేస్తున్న వెంకటేశ్వరరావు

పవన్ కల్యాణ్‌కు ప్రత్యేకంగా ..

"కాటమరాయుడు సినిమాలో పవన్‌కల్యాణ్ ధరించిన చెప్పులు వెంకటేశ్వరరావు తయారు చేసినవే. ఆయన తయారుచేసిన పాదరక్షలు ఒక వైపు ఉబ్బెత్తుగా ఉండి, ఎంతో మెత్తగా, సున్నితంగా ఉండటంతో పవన్‌కల్యాణ్‌కి ఎంతో నచ్చాయి. దీంతో ఆయన వ్యక్తిగతంగానూ వెంకటేశ్వరరావు దగ్గరే పాదరక్షలను ప్రత్యేకంగా తయారు చేయించేవారు. అనంతరం పవన్‌కల్యాణ్, వెంకటేశ్వరరావు నైపుణ్యాన్ని మెచ్చి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఆ నగదుతో వెంకటేశ్వరరావు తెనాలి పట్టణంలోని గంగానమ్మపేటలో 'రమణ ఫుట్‌వేర్' పేరుతో షాపు పెట్టుకుని మరో ఇద్దరికి జీవనోపాధి కల్పిస్తూ జీవనం సాగిస్తున్నారు. పలువురు అగ్రహీరోలకు సైతం చెప్పులు కుట్టి వారి మన్ననలు పొంది తెనాలి ప్రాంత ఖ్యాతిని మరింతగా ఇనుమడింపజేశారు."

ఆగని.. ఆటోల్లో దోపిడీలు



- ప్రయాణికులను హడలెత్తిస్తున్న ముఠాలు
- ఇటీవల నగరానికి చెందిన 10 మంది అరెస్ట్
- అయినా ఆగని నేరాలు
- పని చేయని సీసీ కెమెరాలు

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికులలా నటిస్తూ ఆటోలలో ఒంటరిగా ప్రయాణించే వారిని దోచుకుంటున్న ముఠాల కార్యకలాపాలు మళ్లీ గుంటూరు నగరంలో ఊపందుకున్నాయి. తెనాలి కేంద్రంగా పెద్ద ఎత్తున ఈ తరహా దోపిడీలకు పాల్పడిన గుంటూరు నగరానికి చెందిన పదిమంది ముఠా సభ్యులను ఇటీవల తెనాలి పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠా తెనాలి కేంద్రంగా పెద్ద ఎత్తున ఆటోలలో ప్రయాణికులను దోచుకుంది. అయితే ఆయా ముఠాల్లో ఉన్న వారంతా గుంటూరు నగరానికి చెందిన వారు కావడం గమనార్హం. అయితే ఆయా ముఠాల అరెస్టుతో ఈ తరహా నేరాలు ఆగిపోతాయని పోలీసులు భావించారు. అయితే తాజాగా అలాంటి సంఘటనలు మళ్ళీ జరగడం స్థానికుల్లో భయాందోళనలు కలిగిస్తున్నాయి. నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో రాత్రివేళ ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటో ఎక్కిన ఇరువురు బీహారీలను దుండగులు నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో దారి మళ్లించి వారిపై దాడి చేసి సెల్ ఫోన్, నగదు అపహరించుకుపోయారు. తాజాగా అరండల్ పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని లాడ్జి సెంటర్ వద్ద నరుకుళ్ళపాడు గ్రామానికి చెందిన ఆంజనేయ వరప్రసాద్ అనే వృద్ధుడి జేబులో నుంచి 23 వేలు కొట్టేశారు. ఈనెల 17న మధ్యాహ్నం ఆంజనేయ ప్రసాద్ నరుకుళ్ళపాడు వెళ్లేందుకు లాడ్జి సెంటర్లో ఆటో ఎక్కారు. అప్పటికే ఆటోలో వెనుక ఇరువురు, డ్రైవర్ సీట్ పక్కన మరొకరు ఉన్నారు. దీంతో ఆంజనేయ వరప్రసాద్ వెనుక సీట్లో కూర్చున్నారు. అయితే ఆటో కొద్ది దూరం వెళ్ళగానే ముందుగా అక్కడ పోలీసులు తనిఖీలు చేస్తున్నారని, ముందు సీటులో ఉన్న వ్యక్తిని పథకం ప్రకారం వెనక్కు పంపాడు. ఆయనను మధ్యలోకి జరిపారు. ఆటోలో ఇరుకుగా ఉన్నట్లు మిగిలిన ముగ్గురు ఒకరిపై ఒకరు నెట్టుకుంటూ హడావిడి చేసి ఆయన వెనుక జేబులో పెట్టుకున్న రూ.23 వేలను కొట్టేశారు. ఆటో కొద్దిదూరం వెళ్ళగానే పక్కన ఉన్న వ్యక్తి దిగాలని చెప్పి ఆంజనేయ ప్రసాద్‌ను దించారు. ఆయన అడుగు కిందకు పెట్టిన వెంటనే ఆటోలో నుంచి మిగిలిన వారు దిగకుండానే ఆటో దూసుకుపోయింది. ఆ తర్వాత ఆయన జేబులో చూసుకోగా 23వేలు మాయమయ్యాయి. ఇదే తరహాలో ఇటీవల నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోనూ మరో ఘటన చోటుచేసు కుంది. రాత్రి గాని, పగలుగాని ఒంటరిగా ఆటోల్లో ఎక్కే ప్రయా ణికులను లక్ష్యంగా చేసుకొని ఆయా ముఠాలు ఈ విధం గా దోపిడీలకు పాల్పడుతున్నా యి ఈ నేపథ్యంలో ఒంటరిగా ఆటో ఎక్కే ప్రయాణి కులు జాగ్రత్త గా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉం ది. ఈ ముఠాల కార్యకలాపాలతో ప్రయాణీకులు ఆటోలు ఎక్కాలంటేనే హడలెత్తి పోతున్నారు.

అలంకార ప్రాయంగా సీసీ కెమెరాలు

గుంటూరు పట్టణంలో సీసీ కెమెరాలు అలంకారప్రాయంగా మారాయి. నగరం నడిబొడ్డున నేరం జరిగినా కనీసం ఆనవాళ్లను గుర్తించే పరిస్థితిలో కూడా సీసీ కెమెరాలు లేవు. తెలుగుదేశం ప్రభుత్వంలో కోట్లాది రూపాయలు వెచ్చించి అధునాతన సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించి నప్పటికీ గత వైసీపీ ప్రభుత్వంలో వాటిని పక్కన పడేయడంతో నగరం లో గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు అలంకార ప్రాయంగా మారాయి. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆయా సీసీ కెమెరాలపై దృష్టి సారించి పనులు నిర్వహిస్తోంది. అదేవిధంగా అమరావతి రోడ్డు నుంచి సుమారు కిలోమీటర్ పరిధిలో ఈ నేరం జరిగినప్పటికీ రోడ్డు పక్కన ఉన్న వ్యాపార, వాణిజ్య సముదాయాల్లోనూ సరైన సీసీ కెమెరాలు లేవని తెలుస్తోంది. ఆటో ఆనవాళ్ళను గుర్తించేందుకు అరండల్‌పేట క్రైం పోలీసులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అయినప్పటికీ ఆటోను గుర్తించేందుకు పోలీసులు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు మరోసారి సీసీ కెమెరాలపై దృష్టి సారించి సంబంధిత నేరానికి పాల్పడిన ఆటోను గుర్తించాల్సిన అవసరం ఉంది. అంతేకాకుండా వ్యాపార సముదాయాల్లో మెయిన్ రోడ్లను కవర్ చేసేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాల్సిన అవసరం కూడా ఉంది.

సేంద్రియ ఆహారంతోనే ఆరోగ్యం

- డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు


అవార్డు గ్రహీతలతో డీజీపీ ద్వారకా తిరుమలరావు, కమిషనర్ ఢిల్లీరావు, రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు, మిద్దెతోట నిపుణుడు రఘోత్తమ రెడ్డి

వట్టిచెరుకూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం మనం తినే ఆహారంలో ఉంటున్న రసాయనిక అవశేషాలు మన ఆరోగ్యాన్ని కొంత మేర దెబ్బతీస్తున్నాయని, రసాయనాలు లేని ఆహారాన్ని తినటమే అన్నింటికి పరిష్కారం అని రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు పంచాయతీ పరిధిలోని రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన తుమ్మేటి రఘోత్తమరెడ్డి రైతు నేస్తం, మిద్దె తోటల పురస్కారం - 2024 కార్యక్రమానికి రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఇంట్లో మొక్కలు పెంచుకొనే వారు చాలా వరకు రసాయనాలు ఉపయోగించకుండా చిన్న చిన్న మెళకువలు పాటిస్తూ చీడ, పీడలను నివారించుకుంటూ సేంద్రియ పద్ధతుల్లో వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు పెంచు కోవడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించు కోవచ్చన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఎస్ ఢిల్లీరావు మాట్లాడుతూ ఇంటి మొక్కలు పెంచుకొనే వారికి ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందించడానికి తన వంతు కృషి, పూర్తి సహకారాన్ని అందిస్తానన్నారు. ఇంటి పంటలపై శ్రద్ధ పెరుగుతుందని, నగరంలో ఉన్న మిద్దె తోటలను సందర్శించి వారు వినియోగించే సేంద్రీయ ఎరువులు, వాడే విధానాన్ని తెలుసుకోవాలనే ఆసక్తి పెరుగుతుందని ఢిల్లీ రావు అన్నారు. తొలుత మాజీ ప్రధాని స్వర్గీయ చౌదరి చరణ్‌సింగ్ జయంతిని అంతర్జాతీయ దినోత్సవంగా జరుపుకోవడం హర్షణీయమని, చరణ్‌సింగ్ చిత్రపటానికి డీజీపీ సీహెచ్ తిరుమలరావు, కమిషనర్ ఢిల్లీరావు, వెంకటేశ్వరరావు, రఘోత్తమరెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తుమ్మేటి రఘోత్తమరెడ్డి రైతు నేస్తం పురస్కారాలు 2024 అవార్డులను అందజేశారు. అవార్డు పొందిన వారు ఎంతో మందికి స్ఫూర్తిని కలిగించి ఇంటి పంటదారుల సంఖ్యను పెంచడంలో కృషి చేస్తారని తిరుమలరావు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అవార్డు గ్రహీతలతో పాటు పరిసర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు

గుంటూరు లీగల్: గుంటూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు సెమీక్రిస్మస్ వేడుకలు సోమవారం జిల్లాకోర్టు ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుమతీ జగడం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి పార్థసారథి, రిటైర్డ్ జడ్జి ఎస్.జేసు రత్నకుమార్, పాస్టర్ రెవరెండ్ వై.యోహాన్ రాజు పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కాసు వెంకటరెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ అనురాధ, ట్రెజరర్ దేవదాసు, సీనియర్ న్యాయవాదులు యం.నాగేశ్వరరావు, డేవిడ్ లూదర్‌బాబు, సుభకర్, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.


సెమీ క్రిస్మస్ వేడుకల్లో ప్రసంగిస్తున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుమతి

ఎస్సీ కార్పొరేషన్‌లో...

తాడేపల్లి టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణంలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిజమైన ప్రేమతత్వం కలిగిన వ్యక్తి జీసస్ అని కొనియాడారు. క్రిస్మస్ సందర్భంగా నిరుపేద కుటుంబాలకు చేతనైన సహాయం చేయాలని ఎదుటివారికి సహాయం చేసే మనస్సు ప్రతి ఒక్కరికి ఉండాలని ఆమె అన్నారు. అనంతరం కేక్ కట్ చేసి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పెదపూడి విజయకుమార్, ఎస్సీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ కృష్ణవేణి, కూటమి నేతలు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి

అవిశ్రాంత సాహితీ శ్రామికుడు.. లక్ష్మీనారాయణ

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్

గుంటూరు(తూర్పు), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): అవిశ్రాంత సాహితీ శ్రామికుడు పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం దక్కడం గర్వకారణమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ అన్నారు. గుంటూరు బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అధ్యక్షతన గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం, సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా పాపినేని శివశంకర్ మాట్లాడుతూ గత 40 ఏళ్ళగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో సాహిత్య రంగంలో అనేక పెడ ధోరణులు వ్యక్తమవుతూ కలుషితమవుతున్న నేపథ్యంలో, అభ్యుదయ సాహిత్యానికి గుర్తింపు రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పెనుగొండ లక్ష్మీనారాయణ ఇటీవల రాసిన గుంటూరు సీమ సాహిత్య చరిత్ర అనే గ్రంథంలో అనేక విషయాలు వెల్లడించారన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్యాజీ మాట్లాడుతూ ఆయనకు దక్కిన అవార్డు అభ్యుదయ సాహిత్యానికి లభించిన గుర్తింపు అని అన్నారు. పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అభ్యుదయ రచయితల సంఘం మూలాలను పరిశీలిస్తే, పేదల సమస్యల పరిష్కారం, అభ్యుదయ భావజాలాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకవెళ్ళడమేనని అన్నారు. సభలో మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదు, గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు ప్రసంగించారు. కార్యక్రమంలో ఎన్.కాళిదాసు, సీఎస్సార్ ప్రసాద్, కవులు, కళాకారులు పాల్గొన్నారు.


పెనుగొండ లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న పాపినేని శివశంకర్, కేఎస్ లక్ష్మణరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదు తదితరులు

క్రిస్మస్ సందడి





- నూతన శోభ సంతరించుకున్న చర్చిలు
- ఆకర్షణీయ రంగులతో వెలుగొందుతున్న స్టార్లు
- కిటకిటలాడుతున్న దుకాణాలు

గుంటూరు, ఫిరంగిపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ సందడి నెలకొంది. ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవులు అత్యంత ఘనంగా జరుపుకునే క్రిస్మ స్ వేడుకలకు మరికొద్ది గంటల సమయం మాత్రమే ఉండడంతో క్రైస్తవ సోదరులు పండు గ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. జిల్లా వ్యాప్తంగా అన్ని చర్చీలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. గుంటూరు నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ పర్వదినాన్ని స్వాగతిస్తూ ఏర్పాటు చేసిన స్టార్లు ఆకర్షణీయంగా వెలుగొందుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని దుకాణాలన్నీ కిటకిటలాడుతు న్నాయి. ముఖ్యంగా వస్త్ర దుకాణాల్లో క్రిస్మస్ సందడి నెలకొంది. గడిచిన రెండు రోజులుగా అన్ని దుకాణాల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటుచేసి, ఆఫర్లతో భక్తులను ఆకట్టునేందుకు వ్యాపారులు ప్రయత్నిస్తున్నారు. అదే విధం గా మిఠాయి దుకాణాల్లో కూడా సందడి నెలకొంది. నేటి అర్ధరాత్రి పూజలతో క్రిస్మస్ వేడుకలు ప్రారంభమవుతాయి.

ఫిరంగిపురంలో విస్తృత ఏర్పాట్లు

ఆంధ్రా రోమ్‌గా పిలిచే ఫిరంగిపురంలో ఈనెల 24, 25 తేదీల్లో క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరగను న్నాయి. రాష్ట్రంలోనే అతి పెద్ద దేవాలయంగా 1891లో లండన్ మిల్ హిల్‌కు చెందిన ఫాదర్ థియోడర్ డిక్మన్ స్వామి నిర్మించారు. 24వ తేదీ ఉదయం 5:30 గంటలకు రెవరెండ్ ఫాదర్ మాలపాటి పాతిమా మర్రెడ్డి ఆధ్వర్యంలో దివ్య పూజా బలి జరుగుతుంది. రాత్రి 11:30 గంటలకు క్రీస్తు జయంతి మహోత్సవ జాగరణ దివ్య పూజాబలిని గుంటూ రు బిషప్ డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య నిర్వహిస్తారు. 25వ తేదీ ఉదయం 5:30 గంటలకు రెవరెండ్ ఫాదర్ మాలపాటి పాతిమా మర్రెడ్డి, 8 గం టలకు శ్రీకాకుళం డయాసిస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ తుమ్మా డోమ్నిక్, సాయంత్రం 5:30 గంటలకు కొండమెట్ల వద్ద దివ్య పూజా బలిని ఫాదర్ ఉప్పులూరి రవీంద్రలు నిర్వహిస్తారు. సాయం త్రం 7 గంటలకు వివిధ కాలనీలు, వివిధ గ్రామాల నుంచి తేర్లు ఊరేగింపు, 10 గంటలకు కొవ్వొత్తుల సమర్పణ, రాత్రి 9 గంటలకు బాణ సంచాతో, మేళ తాళాలతో తేరును గ్రామ పుర వీధుల్లో ప్రదక్షణలు చేయనున్నామని రెవరెండ్ ఫాదర్ మాలపాటి ఫాతి మా మర్రెడ్డి తెలిపారు.


ఫిరంగిపురంలో క్రిస్మస్ వేడుకలకు కాంతులీనుతున్న బాల ఏసు చర్చి



పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

నేడు ఆదాయపు పన్నుశాఖ అవగాహన సదస్సు

చిలకలూరిపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాసన్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం సాయంత్రం 5గంటలకు గుంటూరు ఆదాయపు పన్ను శాఖ వారి ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు స్థానిక టాక్స్ బార్ అసోసియేషన్ వారు సోమవారం తెలిపారు. ఈ సదస్సులో ఆదాయ పన్ను శాఖ అడిషనల్ కమిషనర్ డాక్టర్ ఓ ఎస్ సుప్రియారావు, జి అరుణ్ కుమార్ పాల్గొంటారన్నారు. పన్ను చెల్లింపు దారులు ఈ సదస్సులో పాల్గొనాలని వారు కోరారు.

ట్రాన్స్ ఫార్మర్‌లో కాపర్ వైరు చోరీ

నాదెండ్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరంలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ నుంచి కాపర్ వైరును గుర్తు తెలియని వ్యక్తులు చోరీచేశారు. ఎస్ఐ పుల్లారావు తెలిపిన వివరాల ప్రకారం బాపట్ల జిల్లా ఇంకొల్లుకు చెందిన కల్లూరి నాగరాజు సోలార్ సిస్టమ్ కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నాడు. కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసేందుకు తెచ్చిన ట్రాన్స్‌ఫారాలను హైవే సమీపంలో పెట్టారు. గడిచిన 16వ తేదీన ఒక ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైరును చోరీ చేశారు. నాగరాజు ఫిర్యాదు మేరకు నాదెండ్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

27న చిలకలూరిపేటలో ఉద్యోగ మేళా

చిలకలూరిపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 27న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పట్టణంలోని రాగన్నపాలెంలో ఉన్న కమ్యూనిటీ హాలులో ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి తమ్మాజీరావు సోమవారం తెలిపారు. చిలకలూరిపేట నియోజకవర్గం, పరిసర ప్రాంత యువతీ యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొనే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మేళాలో హెటిరో డ్రగ్స్ లిమిటెడ్, వసంత టెక్స్‌టైల్ సంస్థల ప్రతినిధులు పాల్గొని విద్యార్హతను బట్టి ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులు తమకు సంబంధించిన అన్ని వివరాలతో అన్ని పత్రాలను తీసుకొని జాబ్ మేళాకు హాజరు కావాలని పేర్కొన్నారు. వివరాలకు 91005 66581, 91602 00652లో సంప్రదించాలని కోరారు.

సీడ్ బాల్ తయారీపై విద్యార్థులకు అవగాహన

చిలకలూరిపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట రోటరీ క్లబ్ వారి ఆధ్వర్యంలో మండలంలోని కావూరు జడ్పీ హైస్కూల్లో సోమవారం విద్యార్థులకు సీడ్ బాల్స్ తయారీపై అవగాహన కల్పించారు. రోటరీ క్లబ్ డైరెక్టర్ దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వివిధ పద్ధతుల్లో తొలుత విత్తన సేకరణ జరపాలన్నారు. రెండు లేదా మూడు విత్తనాలను కొద్దిగా మట్టి, ఎరువుతో కలిపి బంతిలా చేసి వాటిని నీడలో ఆరబెట్టి భద్రపరచాలని వివరించారు. వర్షాకాలం ఆరంభంలో కొండ ప్రదేశాలలో, బంజరు భూములలో వీటిని చల్లితే మొక్కలై వృక్షాలుగా ఎదుగుతాయని తెలిపారు. ప్రతి విద్యార్థి కనీసం 500 సీడ్‌బాల్స్ తయారుచేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడుకుని ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉండాలంటే మొక్కలను పెంచాలని అన్నారు. క్లబ్ అధ్యక్షుడు ఆళ్ళ వేమనరెడ్డి అధ్యక్షత వహించగా కార్యదర్శి ఉప్పుటూరి ప్రసాదు, క్లబ్ మాజీ అధ్యక్షులు తొట్టెంపూడి వెంకటేశ్వరరావు, హెచ్ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

నాదెండ్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుక్కాపురం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కనపర్రులోని హెచ్‌బీఎల్ ఇంజనీరింగ్ లిమిటెడ్ కంపెనీ వారు ఈ పుస్తకాలను పంపిణీ చేశారు. కంపెనీ తరుపున అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షిస్తున్న సూపర్‌వైజర్ రేవతి, ప్రధానోపాధ్యాయులు అనసూర్యదేవిలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మద్యం మత్తులో దాడి: ఒకరికి తీవ్ర గాయాలు

ఈపూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండ్రముట్ల అడ్డరోడ్డు వద్ద మద్యం మత్తులో ఘర్షణపడిన ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన మస్తాన్‌వలి, గోపి మరికొందరు మద్యం బెల్టుషాపు వద్ద మద్యం సేవిస్తూ మత్తులో మాటామాటా పెరిగి చేతిలో సీసాలతో ఘర్షణకు దిగారు. గొడవలో గోపి సీసాతో మస్తాన్‌వలిని కొట్టాడు. మస్తాన్‌వలి తలకు తీవ్ర గాయం కావడంతో వినుకొండ ఆసుపత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు. ఈ విషయమై ఎస్ఐను వివరణ కోరగా తనకు ఎలాంటి సమాచారం లేదన్నారు. గ్రామంలో ఉన్న మద్యం బెల్టు షాపు వద్ద గతంలో కూడా గొడవలు జరిగినట్లు గ్రామస్థులు వాపోతున్నారు. సాయంత్రం సమయంలో అటువైపు వెళ్లాలంటే ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు.

సినీ పరిశ్రమను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావాలి: శ్రీనివాసరావు

శావల్యాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపులకు గురవుతున్న సినీ పరిశ్రమను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు చొరవ తీసుకొని ఆంధ్రప్రదేశ్‌కు తరలివచ్చేలా కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ కాపు యువసేన అధ్యక్షుడు కర్నా శ్రీనివాసరావు కోరారు. శావల్యాపురంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సినీహీరో అల్లు అర్జున్ ఆంధ్రప్రదేశ్‌కు చెందినవాడు కాబట్టే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనపై కక్ష సాధింపులకు పాల్పడుతోందన్నారు. అయన ఇంటిపై ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు దాడి చేయడం వెనుక సీఎం రేవంత్ రెడ్డి హస్తముందన్నారు. రోడ్ల విస్తరణ పేరుతో హీరో నందమూరి బాలకృష్ణ ఇంటికి మార్కింగ్ చేయడం, ప్రీమియర్ షోలకు అనుమతులు ఇవ్వకపోవడం సినీ పరిశ్రమపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కక్షసాధింపులకు నిదర్శనమన్నారు.

ఈ క్రాప్‌లో నమోదు కాక రైతన్నల ఇక్కట్లు

● మద్దతు ధరకు పంటను అమ్ముకోలేక పాట్లు


పెదకంచర్లలోని ఖాళీ స్థలాల్లో ఆరబెట్టిన ధాన్యం


ఈ క్రాప్ నమోదు కోసం రైతు సేవ కేంద్రాలకు వచ్చిన రైతులు

వినుకొండ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మద్దతు ధరకు పండిన పంటను అమ్ముకోలేక రైతులు ఇక్కట్లు పడుతున్నారు. మండలంలోని పెదకంచర్ల చెరువుపై ఆధారపడి పెదకంచర్ల, జంగాలపల్లి, పెరుమాళ్లపల్లి, మదమంచిపాడు, ఏనుగుపాలెం గ్రామాలకు చెందిన రైతులు వందల ఎకరాల్లో వరిపంటను సాగుచేశారు. పల్నాడులో చివరి భూములకు నీరు వస్తుందనే భరోసాతో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సంవత్సరం వివిధ రకాల వరి వంగడాలను సాగుచేశారు. ఖరీఫ్‌కు జూలై నెల నుంచి సెప్టెంబరు 30వరకు ఖరీఫ్ సీజన్ ముగియడంతో వరి పంట సాగుచేస్తున్న రైతులకు ఈ క్రాప్ నమోదు అందని ద్రాక్షగా మారింది. ఎన్నడూ లేని విధంగా సుమారు 3వేల ఎకరాలకు పైగా గ్రామాల్లో వరి పండించినప్పటికి రబీ సీజన్ ముగిసే సమయానికి పెదకంచర్ల గ్రామంలో కేవలం 300 ఎకరాలకు మాత్రమే ఈ క్రాప్ నమోదైంది. మార్కెట్‌లో వరి బస్తాలకు డిమాండ్ లేకపోవడంతో ఎరువు బస్తాల రేటుకే దళారీలు వడ్లను అడగడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో రైతులు లబోదిబోమంటున్నారు. కనీసం రైతు సేవా కేంద్రంలో అయినా ఈ క్రాఫ్ నమోదైతే మద్దతు ధర కోసం ప్రభుత్వం సూచించిన రేటుకు ధాన్యం అమ్మి నష్టాల నుంచి గట్టెక్క వచ్చునని రైతులు బావిస్తున్నారు. ఖరీఫ్ సెప్టెంబరు 30వ తేదీ నాటికి ఈ క్రాప్ నమోదు సమయం ముగియడంతో పంట చేతికి వచ్చిన తర్వాత రబీలో ఈ క్రాప్ నమోదు చేస్తామని చెప్పడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇప్పటికే వందల ఎకరాల్లో రైతులు వరి పంటలను కోసి గ్రామంలో ఆరుబయట ఆరబెట్టి ఈ క్రాప్ నమోదుకోసం ఎదురు చూస్తున్నారు. ఇది కేవలం పల్నాడు ప్రాంతంలోని కొన్ని ప్రాంతాలకే పరిమితం కావడంతో పంటలు పండించిన రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా ఈ క్రాప్ నమోదు కాకపోవడంతో పంటలకు పెట్టుబడిన పెట్టిన మందుల యజమానులకు పంట అమ్ముకోవాల్సి వస్తుందంటూ రైతులు వాపోతున్నారు.

ధాన్యం కొనుగోలుకు ముందుకు రాని మిల్లర్లు..

ప్రభుత్వం ద్వారా కొనుగోలుచేసిన ధాన్యాన్ని బ్యాంకు గ్యారెంటీ చెల్లించి రైస్ మిల్లర్లు ధాన్యాన్ని కొనుగోలు చేస్తారు. వినుకొండ నియోజకవర్గంలో కేవలం ఇప్పటి వరకు ఇరువురు మిల్లుల యజమానులు మాత్రమే బ్యాంకు గ్యారెంటీతో ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇంకా మిగిలిన మిల్లు యజమానులు బ్యాంకు గ్యారెంటీ చెల్లించకపోవడంతో ధాన్యం ఎగుమతికి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రతి ఫిర్యాదు పరిష్కారం కావాలి

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ అరుణ్ బాబు


అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి ఫిర్యాదు పరిష్కారం కావాలని కలెక్టర్ పీ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నరసరావుపేట పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జిల్లా వ్యాప్తంగా 38 మంది అర్జీదారులు వినతులను అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పీ అరుణబాబు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారం అవుతాయన్న నమ్మకంతో సుదూర ప్రాంతాల నుంచి అర్జీదారులు వస్తుంటారన్నారు. అటువంటి వారి సమస్యలను సావధానంగా విని, సత్వర పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలని, ఆ పరిష్కారంతో అర్జీదారులు సంతృప్తి చెందాలని సూచించారు. ఇందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరిష్కారం చూపాలని అన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఆర్వో మురళి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల భూములు ఆక్రమించారు

నాదెండ్ల మండలం చిరుమామిళ్ళకు చెందిన ఎస్సీ, ఎస్టీలకు అప్పటి నాదెండ్ల తహసీల్దార్ 9.38 ఎకరాలు పట్టాలు మంజూరు చేశారని గ్రామస్థులు కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఫిర్యాదుచేశారు. అయితే ఆ భూములను వైసీపీ నేత సింగారెడ్డి కోటిరెడ్డి ఆక్రమించి సాగుచేసుకుంటున్నాడని ఫిర్యాదు చేశారు. ఇప్పుడు ఆ భూములను కౌలుకు ఇచ్చుకుంటున్నాడని, మా భూములు మాకు అప్పగించకుండా బెదిరిస్తున్నారని ఆరోపించారు. కోటిరెడ్డి తన ఇంటికి పిలిపించుకొని అమ్మినట్లు సంతకాలు పెట్టి, ఆధార్‌కార్డు కాపీలను ఇవ్వాలని బెదిరిస్తున్నాడన్నారు. ఉన్నతాధికారులు సింగారెడ్డి కోటిరెడ్డిపై తగు చర్యలు తీసుకొని భూములు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో హరికృష్ణ, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్

చిలకలూరిపేట, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెదనందిపాడు రోడ్డులో ఉన్న పునీత చిన్న తెరిజమ్మ ఆర్సీఎం చర్చిలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. చర్చి ఫాదర్ రెవరెండ్ మరియదాసు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఫిరంగిపురం విచారణ గురువు ఫాదర్ రవీంద్ర క్రిస్మస్ సందేశం వినిపించారు. ఈ సందర్భంగా దేవాలయాన్ని ప్రత్యేకంగా, సుందరంగా అలంకరించారు. క్రిస్మస్ కేక్ కట్ చేశారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు, అనాథలకు, వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు సంఘ పెద్దలు, విశ్వాసులు, సిస్టర్స్ పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండలంలోని గణపవరం అంబేడ్కర్ నగర్‌లోని సిలోహా క్రిష్టియన్ ప్రార్థనా మందిరంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన కొప్పుల ఓబయ్య వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ శ్రీనివాసరావు, పెద్దలు దారా కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

● వినుకొండ: మండలంలోని జాలలపాలెం గ్రామంలో ఆర్సీఎం చర్చిలో సెమీక్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నరగాయపాలెం మాజీ సర్పంచ్ యర్రం అంజిరెడ్డి, ఉపదేశి కీర్తిపాటి ఇన్నయ్యలు పాల్గొని కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ వంకాయలపాటి రామకృష్ణ, నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో గ్రామంలోని ఎస్సీ కాలనీ లో మహిళలకు చీరెలు, నిత్యావసరాలు పంపిణీ సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎం.సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ కొల్లి వెంకటేశ్వర్లు, బి.శ్రీను, కె.వెంకటేశ్వర్లు, పి.చిన్న వెంకటేశ్వర్లు, బాబు, అంకారావు, పిడతల ఇన్నయ్య, విజయరాజు, రాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

● శావల్యాపురం: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని శావల్యాపురం గ్రామ సచివాలయంలో సెమీక్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య, ఈవోపీఆర్డీ సుగుణ, ఏపీఎం గుమ్మడిల్లి వాసుబాబు, ఏపీవో కటారపు రామారావులు ముఖ్య అతిథులుగా పాల్గొని క్రిస్మస్ కేకును కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జుజ్జూరి ఐరామ్మూర్తి, పంచాయతీ కార్యదర్శి యాకోబు తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: స్థానిక కేసానుపల్లిలోని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు క్రిస్మస్ విశిష్టత తెలియజేసే నృత్యాలు, నాటికలు, దేవుని గీతాలాపన ప్రత్యేక అకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు, ఏసుపోగు రవికాంత్, రత్నకుమార్, కళాశాల చైర్మన్ షేక్ మీరావలి, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహిద్దీన్, మేనేజింగ్ డైరెక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమా, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం


శావల్యాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ గణితశాస్త్ర దినోత్సవాన్ని మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. శావల్యాపురంలోని శ్రీరామ పబ్లిక్ స్కూల్‌లో ఎంఈవో-2 పుసులూరి లలితకుమారి పాల్గొని పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి వాటి చుట్టూ నిర్మించిన రేఖాగణిత ఆకృతులను ఆవిష్కరించారు. గణిత మేళాలో విద్యార్థులు చేసిన గణితాంశాలు అందరినీ ఆకట్టుకొన్నాయి. అనంతరం గణితమేళాలో ప్రతిభచూపిన విద్యార్థులకు ఎంఈవో బహుమతులను అందజేశారు. కరస్పాండెంట్ కేవీఆర్ మోహన్‌చంద్, ప్రిన్సిపాల్ రత్నకుమారి, డైరెక్టర్ అజిత్‌చంద్, టీచర్ మేఘన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వేల్పూరు జడ్పీ పాఠశాలల్లో గణితశాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు క్విజ్, వ్యాస రచన, పజిల్, వక్తృత్వం తదితర పోటీలను నిర్వహించారు. క్విజ్‌లో వివేక్ గ్రూప్, గణిత ఫార్ములాస్‌లో జస్వంత్ ప్రథమస్థానంలో నిలిచారు. గెలుపొందిన విద్యార్థులకు గ్రామానికి చెందిన ఎస్వీఆర్ పరమేశ్వరరావు సహకారంతో బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సుభానీ, ఉపాధ్యాయులు రఘునాథ్‌బాబు, జ్యోతి శ్రీనివాసరావు, శివరామకృష్ణ, పీడీ కాకుమాను రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్ల మండలంలో...

నాదెండ్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందవరం ప్రాథమిక పాఠశాలలో సోమవారం గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజం జయంతిని పురస్కరించుకొని జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. నిత్య జీవితంలో గణితం ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పీ వీరయ్యచౌదరి, ఉపాధ్యాయులు ఎం మాధవి తదితరులు పాల్గొన్నారు.

పంటలు దెబ్బతిన్న ప్రతి రైతును ఆదుకుంటాం

● ఏడీఏ రవిబాబు


కొచ్చెర్లలో వర్షానికి నేలవాలిన మొక్కజొన్న, వరి పైర్లను పరిశీలిస్తున్న ఏడీఏ రవిబాబు

ఈపూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షానికి పంటలు నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బీ రవిబాబు అన్నారు. శనివారం రాత్రికురిసిన వర్షానికి దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, పొగాకు పైర్లను సోమవారం ఆయన పరిశీలించారు. పంటల నష్టం అంచనాలను ప్రభుత్వానికి పంపుతామన్నారు. రైతులు తమ పంట పొలాలలోని నీటిని బయటకు పంపాలన్నారు. వరి ఓదెలను నీటిలో లేకుండా గట్టు మీదకు చేర్చి రంగు మారకుండా ఉప్పుద్రావణంను ఓదెలుపై పిచికారి చేసుకోవాలన్నారు. ప్రాథమిక అంచనాలు ప్రభుత్వానికి నివేదికపంపినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల ద్వారా రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు.

అమిత్ షాపై చర్యలు తీసుకోవాలంటూ నిరసన

రొంపిచర్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా రొంపిచర్ల మండల ప్రజా ఐక్య వేదిక ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లో సోమవారం నిరసన తెలిపారు. సర్పంచ్ తిప్పగుడిశ జయమ్మ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐక్యవేదిక నాయకులు సరికొండ వెంకటేశ్వరరాజు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి వ్యాఖ్యలు సిగ్గు చేటన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం తహసీల్దార్ బండి నిర్మలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కామినేని రామారావు, సరికొండ తిమ్మరాజు, బత్తుల బాల కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వ్యవసాయ మార్కెట్ నూతన విధానాన్ని వెనక్కి తీసుకోవాలి

● ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాదు




ధర్నాలో పాల్గొన్న అఖిల పక్షాల రైతు సంఘాల నాయకులు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాదు డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని గాంధీ పార్క్ వద్ద కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ మార్కెటింగ్ విధానాన్ని వ్యతిరేకిస్తూ రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం జీవో కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా కేవీవీ ప్రసాదు మాట్లాడుతూ గత 26 రోజులుగా నిరాహారదీక్ష చేస్తున్న రైతు నాయకుడు దల్లేవాలా ప్రాణాలు కాపాడాలని, ఢిల్లీకి పాదయాత్ర చేస్తున్న రైతులపై అణచివేతను ఆపాలన్నారు. గ్రేటర్ నోయిడా రైతులందరినీ లక్సర్ జైలు నుంచి తక్షణమే విడుదల చేయాలని, జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని వెనక్కి తీసుకవాలని, కేరళ తరహాలో రుణమాఫీ చట్టాన్ని అమలు చేయాలన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ పీ అరుణ్‌బాబు ద్వారా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ పంపించారు.

కార్యక్రమంలో రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై రాధాకృష్ణ, ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రెడ్‌బాషా, పీడీఎం నేత వై వెంకటేశ్వరరావు, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము, గుంటుపల్లి బాలకృష్ణ, లక్షాధికారి, నల్లపాటి రామారావు, వలి, సైదా, హరిబాబు, బోసు తదితరులు పాల్గొన్నారు.

రెజ్లింగ్, ఖో-ఖో పోటీలలో ముప్పాళ్ళ విద్యార్థుల ప్రతిభ


హిమబిందు, వంశీ

ఈపూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ళ ధనలక్ష్మీ వ్యాయామ కళాశాల విద్యార్థిని ఎస్.హిమ బిందు ఈ నెల 20వ తేదీన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన రెజ్లింగ్ పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచి విశ్వవిద్యాలయం జట్టుకు ఎంపికైంది. అదేవిధంగా కళాశాలకు చెందిన ఎం.వంశీ ఈ నెల 21, 22 తేదీలలో టీజేపీఎస్ కళాశాలలో జరిగిన ఖో-ఖో పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచి విశ్వవిద్యాలయం జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ చుండు వెంకటరావు సోమవారం తెలిపారు. పంజాబ్ రాష్ట్రంలోని గురుకాశి యూనివర్సిటీలో జరిగే రెజ్లింగ్ పోటీలలో హిమబిందు పాల్గొననుంది. ఎం వంశీ సెంట్రల్ యూనివర్సిటీ తమిళనాడులో జరిగే సౌత్‌జోన్ ఖో-ఖో పోటీలలో ఏఎన్‌యూ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరిరావు, అధ్యాపకులు ఆర్.బలరాం నాయక్, సీహెచ్ అరవింద్, ఎం.దాస్, కే వంశీలు అభినందించారు.

మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు ఘన నివాళి

వినుకొండ, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్రాహ్మణ భవన్‌లో బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భారత దేశానికి మాజీ ప్రధాని పీవీ నరసింహారావు చేసిన సేవల గురించి కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పీవీ సురేష్, గాలి శ్రీనివాసరావు, బ్రాహ్మణ పెద్దలు మంత్రిరాజు సత్యనారాయణ, పట్టణ పురోహితులు యడవల్లి శ్రీనివాసశర్మ, వెంకటేశ్వరరావు, రవికుమార్, శర్మ, నారాయణ ఆనందచార్యులు, యం.శివకుమార్, చంద్రశేఖర్‌శర్మ, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

అమరేశ్వరుని దర్శించుకున్న ఎస్పీ దంపతులు



అమరావతి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా సోమవారం అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఎస్పీ దంపతులను ఈవో సునీల్‌కుమార్, అర్చకులు ఘన స్వాగతం పలికారు.

సర్పంచ్, ఫీల్డ్ అసిస్టెంట్‌లపై చర్యలకు ఆదేశం

మతుకుమల్లి (శావల్యాపురం) డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మతుకుమల్లిలో ఉపాధిహామీ కూలీలతో పనులు చేయించి వారికి వేతనాలను చెల్లించకుండా ఉపాధి హామీ పథకం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన సర్పంచ్, ఫీల్డ్ అసిస్టెంట్‌లపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ సిద్దిలింగమూర్తి స్థానిక అధికారులకు ఆదేశాలు జారీచేశారు. గతేడాది మతుకుమల్లికి చెందిన ఉపాధి హామీ కూలీలతో గ్రామంలోని తాగునీటి పథకం వద్ద ఫిల్టర్ బెడ్‌ల మరమ్మతుల పనులు చేయించి దానికి బదులుగా గ్రామంలోని సుబ్బడికుంట, పంట కాలువల్లో పనులు చేయించినట్లుగా ఫీల్డ్ అసిస్టెంట్ తప్పుడు మస్టర్‌లు వేశాడని, ఏడాది గడుస్తున్నా తమకు వేతనాలు ఇవ్వలేదని ఉపాధిహామీ కూలీలు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విచారణలో ఉపాధి హామీ నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు తేలడంతో మాజీ ఫీల్డ్ అసిస్టెంటుపై, సర్పంచ్‌పై తగినచర్యలు తీసుకోవాలని, ఉపాధి హామీ కూలీల వేతనాలు వెంటనే ఇప్పించాలని డ్వామా పీడీ ఆదేశాలు జారీ చేశారు.

సౌత్‌జోన్ ఖోఖో పోటీలకు కృష్ణవేణి డిగ్రీ విద్యార్థుల ఎంపిక


ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, తదితరులు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గుంటూరు టీజేపీఎస్‌లో నిర్వహించిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పురుషుల ఖోఖో పోటీలలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి తృతీయ స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. విశ్వవిద్యాలయ ఖోఖో జట్టుకు కళాశాలకు చెందిన పీ గోపినాథ్, ఎస్కే అల్లాభక్షు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 28నుంచి 30వరకు తమిళనాడులోని సెంట్రల్ యూనివర్సిటీలో జరిగే దక్షిణ భారత విశ్వవిద్యాలయాల పోటీలలో ఏఎన్‌యూ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. విద్యార్థులను పీడీ ఈదర ఆదిబాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎంఆర్‌కే సతీష్‌బాబు, కోచ్ ఎస్‌కే మహమ్మద్ తదితరులు అభినందించారు.

నేషనల్ సీనియర్ బేస్‌బాల్ జట్టుకు ఎంఏఎం విద్యార్థి ఎంపిక

నరసరావుపేట టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎంఏఎం కళాశాల పీజీ విద్యార్థి బీ సాగర్ నేషనల్ సీనియర్ బేస్‌బాల్ జట్టుకు ఎంపిక అయ్యారని చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు సోమవారం తెలిపారు. వెంకటాచలం మండలం కసుమూరు జడ్పీహెచ్‌ఎస్‌లో జరిగిన టోర్నమెంట్‌లో ఈ ఘనత సాధించాడన్నారు. ఈ నెల 26 నుంచి 30 వరకు పంజాబ్ రాష్ట్రంలో జరిగే నేషనల్ బేస్‌బాల్ చాంపియన్ టోర్నమెంట్‌కు రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడన్నారు. ఎంపికైన బీ సాగర్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌రామారావు, డైరెక్టర్ దరువూరి శ్రావ్య, పీడీ శంకర్ తదితరులు అభినందించారు.

కిషోర్‌కు టీడీపీ శాశ్వత సభ్యత్వ నమోదు కార్డు అందజేత


శాశ్వత సభ్యత్వ కార్డును ఎమ్మెల్యే అరవిందబాబు నుంచి అందుకుంటున్న వడ్లమూడి వెంకట కిషోర్

రొంపిచర్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్లకుంట గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు వడ్లమూడి వెంకట కిషోర్ రూ. లక్ష చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కిషోరుకు సభ్యత్వ కార్డును అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పులుకూరి జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.